ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 106 | బుధవారం 14 జనవరి 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




గ్రామాల్లో మొదలైన
## సంక్రాంతి సందడి

- పట్టణాల నుంచి పల్లెలకు చేరుకున్న ప్రజలు..
- ఊరూరా ముగ్గులు,గొబ్బెమ్మలతో కొత్త కళ..
- కోడి పందాలకు బరుల ఏర్పాట్లలో కొందరు బిజీ బిజీ..



**అమరావతి (తెలుగోడు), జనవరి 13 :**
సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. ఇంటింటా పిండివంటల సువాసనలు, ముంగిట ముగ్గులు, ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు, వీధుల్లో హరిదాసుల గానాలు.. ఈ అన్నింటితో గ్రామాలు కళకళలాడిపోతుంటాయి. సంక్రాంతి సందడితో ఇప్పుడు ఎపిలోని గ్రామాలు సందడిగా మారాయి. అప్పుడే గ్రామాల్లో కొత్త శోభ కనిపిస్తోంది. ముగ్గులు, గొబ్బెమ్మలు ఆకర్శణీయంగా దర్శనమిస్తున్నాయి. పట్టణాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో పలకరింపులు, ముచ్చట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో సంక్రాంతి సందడి ఊపందుకుంది. బసవన్న విన్యాసాలు, కర్రసాము, కత్తిసాము, డప్పు కళాకారులు హోరెత్తించే ప్రదర్శనలు, కోలాటం, పులివేషాలు.. ఇలా ప్రతి మూలా ఓ సంబరం కనిపిస్తుంటుంది. అన్నింటికీ మించి (మిగతా 2లో)



తెలుగుదేశం వైయస్ఆర్‌సీపీ ల మధ్య
# రాజధాని రగడ

- నదీ పరివాహక ప్రాంతంలో నిర్మించడమేంటన్న జగన్..
- నదులకు, నాగరికతకు విడదీయరాని బంధం అంటున్న టీడీపి..
- విజయవాడ, గుంటూరు మధ్య వుంటే బాగుండన్న జగన్..
- అభివృద్ధి చెందిన నగరాలన్నీ నదులకు ఆనుకునే నిర్మించారంటున్న టీడీపి..
- మొదలైన పరస్పర విమర్శలు..

**అమరావతి (తెలుగోడు), జనవరి 13 :**
ఇటీవల మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యలతో మరోమారు రాజధాని రగడ రాజుకుంది. అమరావతిని రివర్ బేసిన్‌లో నిర్మిస్తున్నారని జగన్‌తో పాటు, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలను అధికార పార్టీ నేతలు గట్టిగా తిప్పికొడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడం ఏమిటని జగన్ ప్రశ్నిస్తున్నారు. నదులకు, నాగరికతకు మధ్య విడదీయరాని బంధం అనాదిగా ఉందన్న విషయం జగన్‌కు తెలియదని సిఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. నదులు ఉన్న చోటే నాగరికత వెల్లివిరిసింది. ప్రపంచంలో అనేక మహా నగరాలు నదీ తీరాలలోనే నిర్మితమయ్యాయి. అనేక నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్ నగరం హడ్సన్ నదీ తీరం వెంబడి నిర్మితం కాలేదా? సీన్ నదీ తీరం వెంట ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్, ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నదీ తీరం వెంట, ఇటలీ రాజధాని రోమ్ నగరం టైబర్ నది వెంట, నైలు నదీ తీరంలో ఈజిప్టు రాజధాని కైరో, చైనాలోని షాంఘై నగరం యాంగ్జి నదీ తీరం వెంట నిర్మితమైనవే కదా అని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇదే సందర్భంలో సింధూనాగరికత గురించి జగన్ తెలుసుకోవాలన్నారు. తరచుగా లండన్ వెళ్లే జగన్ రెడ్డి అక్కడ థేమ్స్ నదిని చూసే ఉంటారు కదా అని టిడిపి శ్రేణులు విమర్శలకు దిగారు. అంతెందుకు గోల్కొండ నవాబులు హైదరాబాద్ నగరాన్ని మూసీ నది ఒడ్డునే నిర్మించారు కదా అన్నారు. అయితే 2019కి ముందు జగన్ మాట్లాడిన మాటలకు ఇప్పుడు మాట్లాడే మాటలకు పొంతన లేకుండా మిగతా 2లో

ఆటలు, పాటలతో నారావారింట
# సంక్రాంతి సందడి



- నారావారిపల్లిలో సిఎం కుటుంబీకుల సంక్రాంతి సంబరాలు..
- పిల్లల ఆటలపోటీలు, పాటలతో గ్రామంలో సందడే సందడి..!

**తిరుపతి (తెలుగోడు), జనవరి 7 :**
ఏపీ సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిప్లలెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా మొదలయ్యాయి. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రాహ్మణి, దేవాంశ్, బాలకృష్ణ సతీమణి వసుంధర, తేజస్విని, శ్రీభరత్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రజలతో కలిసి సరదాగా గడిపారు. తన నివాసం ముందున్న మైదానంలో చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన (మిగతా 2లో)

వీధి కుక్కలను కట్టడి చేసే
# బాధ్యత రాష్ట్రాలదే

- ఒక్కటి కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే..
- అందుకు భారీ జరిమానాలు ..
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే..
- ఘాటుగా హెచ్చరించిన సుప్రీం కోర్టు..



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 13:**
ఇటీవల వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ (మిగతా 2లో)

# భోగి పళ్లు పోయడం తెలుగువారి ఆచారం

పిల్లల్లో గ్రహపీడ పోవాలనే అనాదిగా వస్తున్న భోగిపళ్ల సాంప్రదాయం..




**నల్లమాడ (తెలుగోడు), జనవరి 13 :** తెలుగు ప్రజలు జరుపుకొనే ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగను మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకొంటారు. ఈ మూడు రోజుల్లో తొలి రోజును భోగి పండుగగా.. రెండో రోజును మకర సంక్రాంతి పండుగగా.. మూడో రోజును కనుమ పండుగగా పిలుస్తారు. అయితే.. ఈ భోగి పండుగ రోజు ఆచరించే ప్రధానమైన ఆచారాల్లో భోగి మంటలు వేయడమే కాకుండా భోగి పళ్లు పోయడం కూడా ఉంటుంది. భోగి పండుగ రోజు సాయంత్రం పెద్దలు తమ ఇంట్లోని ఐదు లేదా ఆరేళ్లలోపు చిన్నారుల తలపై రేగుపళ్లు పోస్తారు. వీటినే భోగి పళ్లు అంటారు. ఈ భోగి పండ్ల కోసం రేగు పండ్లు, చెరుకు గడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణెళిలు తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శనగలు, చిటికెడు పసుపు, కొన్ని బియ్యం కూడా కలుపుతారు. ఈ భోగి పండుగ రోజున సాయంత్రం పూట చుట్టుపక్కల ఉండే పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా భోగి పళ్లు తీసుకుని మూడుసార్లు పిల్లల చుట్టూ తిప్పి తలపై పోస్తారు. వాటిని పిల్లలు ఆనందంగా (మిగతా 2లో)

బార్లు, షాపుల్లో
# మద్యం ఒకే ధర



**అమరావతి (తెలుగోడు), జనవరి 13 :**
రాష్ట్రంలో ఇప్పటివరకూ మద్యం షాపులు, బార్ల మధ్య ఓ విషయంలో చూపుతున్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం ఇవాళ రద్దు చేసింది. దీంతో ఈ రెండు చోట్లా లభించే మద్యం ధరల్లో ఇకపై సమానత్వం రాబోతోంది. అలాగే మందుబాబులు తమకు అందుబాటులో ఉన్న చోటకు వెళ్లి (మిగతా 2లో)

వివేకా హత్యకేసు
# మళ్లీ సుప్రీం కోర్టుకి



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 13 :**
ఏపీలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇవాళ మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గతంలో ఈ కేసులో నిందితుల బెయిల్ రద్దు చేయడంతో పాటు సీబీఐని మరోసారి లోతుగా దర్యాప్తుచేసేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆయన కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టు వరకూ వెళ్లారు. దీంతో ట్రయల్ కోర్టును దీనిపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ మేరకు నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలు సంతృప్తికరంగా లేకపోవడంతో సునీత మళ్లీ (మిగతా 2లో)

# ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో..!

- మహిళా సాధికారతపై కమిట్మెంట్ లేని సిఎం..
- మహిళల మనోభావాలతో ఆటలు..
- మహిళలకు చంద్రబాబు ఘరానా మోసం..
- పిసిసి ప్రెసిడెంట్ షర్మిల..




**అమరావతి (తెలుగోడు), జనవరి 13 :**
అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కూటమి అధినేతగా చంద్రబాబు మహాశక్తి గ్యారంటీలో భాగంగా ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకం ఇప్పటివరకూ అమలు కాలేదు. వరుసగా రెండోఏడాది కూడా ఈ పథకం అమలు చేయకపోవడంపై పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల ఇవాళ సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. రెండేళ్లు కావస్తున్నా మహాశక్తి పథకానికి అతి గతి లేదన్నారు. పండుగల పేరు చెప్పి కాలయాపన తప్ప మహిళా సాధికారితపై చంద్రబాబుకు కమిట్మెంట్ లేదన్నారు. ఈ పథకం కావాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ఒకరు, మహిళలు రెడీగా ఉండమని మరొకరు.. (మిగతా 2లో)

# చేతికి చిక్కనంటున్న చికెన్

- కొండెక్కిన బాయిలర్ చికెన్ ధరలు ..
- ముక్క తగ్గనంటోంది, ముద్ద దిగనంటోంది...
- కిలో బాయిలర్ చికెన్ రూ 290, స్కిన్‌లెస్ రూ 320..





**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 13 : షాషావలి...**
ఏంకొనేటట్టు లేదు, ఏంతినేటట్టు లేదు, నాగులో నాగన్న, ధరలిట్టె మండపెట్టే, ధరలమీద ధరలెక్కేనని సినీగేయ రచయిత ఎప్పుడో వ్రాసింది నేడు అక్షరసత్యంగా మారింది. ఆంధ్రప్రదేశ్ లో దాదాపు అన్ని జిల్లాలో చికెన్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలో బాయిలర్ చికెన్ రూ.290, స్కిన్ లెస్ రూ.320 ధరతో అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో కొనుగోలుదారులు లేక వ్యాపారస్తులు, కొనుగోలు చేయలేమంటున్నా ప్రజలు, ఇలాంటి పరిస్థితి ఏపీలో దాపురించిందని చెప్పుకోవచ్చు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు అంతంత పెరుగుతూ రూ.320కు చేరిన పరిస్థితి నెలకొంది. వరుస పండుగలతో బాయిలర్ కోడి మాంసానికి గిరాకీ పెరిగింది. కార్తిక మాసంలో విక్రయాలు కొంత డీలా పడినప్పటికీ, నెల వ్యవధిలో రూ.100 పెరిగి కొండెక్కి (మిగతా 2లో)

పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో అంబరాన్నంటిన
# సంక్రాంతి సంబరాలు

- పల్లెటూరి వాతావర ఏర్పాట్లు
- సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు ప్రారంభం
- ఆకట్టుకున్న ఎడ్లబండి
- అధికారుల పంచెకట్టు
- అందమైన రంగవల్లులు
- ప్రజలకు, పోలీస్ కుటుంబాలకు, మీడియా ప్రతినిధులకు సంక్రాంతి శుభాకాంక్షలు..ఎస్పీ

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 13 :**
ప్రతినిత్యం సమాజ సంక్షేమం కోసం శ్రమించే పోలీసులు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను సాంప్రదాయంగా ప్రారంభించారు. అనునిత్యం ఖాకీ దుస్తులతో లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్‌చేసే అధికారుల పంచెకట్టు, అందంగా అలంకరించిన ఎడ్లబండ్లు, సంక్రాంతి ప్రత్యేకతను చాటే రంగవల్లులు, శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయమంతా అందమైన ఓ పల్లె వాతావరణాన్ని తలపించింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆయన సతీమణి ధరణి, అడిషనల్ ఎస్పీ అంకిత సురాని ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై, భోగి మంటలు వెలిగించి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ స్వయంగా సాంప్రదాయ బద్ధంగా గంగిరెద్దులకు పూజల నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేశారు. చిల్లాకట్టి,గోలీలాట, ఉట్టి కొట్టడం వంటి ఆటలను ఎస్పీ ఆడటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి అనేది అందరి పండుగ అని, సాంప్రదాయ బద్ధంగా ఈ పండుగను పోలీస్





కుటుంబాల మధ్య చేసుకోవడం ఎంతో సంతోషం అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సహచరులతో కలిసి పంచుకోవడమే సంక్రాంతి ప్రత్యేకత అని అన్నారు. సాంప్రదాయ పండుగలను కులాలు, మతాలకు అతీతంగా ఐక్యతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేడుకలు పోలీసులపై ఉండే విధి ఒత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసం, నూతనోత్సాహాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ సూచించారు.

**ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు..**
సంక్రాంతి పండుగ వేడుక సందర్భంగా కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన రంగువల్లుల పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈవేడుకల్లో భాగంగా మహిళలు పోలీసు కుటుంబ సభ్యులు వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీలను జిల్లా ఎస్పీతో పాటు వారి సతీమణి ధరణి , అడిషనల్ ఎస్పీ అంకిత సురాని ప్రారంభించారు. కమిటీ సభ్యులు ముగ్గులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. లెమన్ స్పూన్, (మిగతా 2లో)

# రాజధాని రగడ



(మొదటి పేజి (తరువాయి))

ఉంది. సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అంటున్నారు. తాగునీటి అవసరాలు తీరడానికి రాజధాని నదీ తీరంలో నిర్మించాలని గతంలో చెప్పిన విషయాన్ని విస్మరించారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని, కనీసం 30 వేల ఎకరాల భూమి ఉండాలని, అమరావతిని రాజధానిగా ప్రకటించినందున తాను కూడా తాడేపల్లిలో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. 2019లో అధికారంలోకి రాగానే రాజధానిని ఒక కులం వారి కోసమే కడుతున్నారని నిందలు వేసారు. అమరావతిని శ్మశానంతో, ఎడారితోనూ పోల్చారు. భూములు ఇచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించి అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రివర్ బేసిన్ అనే కొత్త రాగం అందుకున్నారు. తాను అమరావతిని రాజధానిగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టంగా చెప్పారు. అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్నదే జగన్ నిర్ణయంగా ఉందని తెలుస్తోంది. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెరలేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు.

ఉమ్మడి ఎపి విభజన జరిగిన పదకొండున్నర సంవత్సరాల తర్వాత రాజధాని నిర్మాణం చర్చనీయాంశంగామార్చాలని చూస్తున్నారు. తన ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని లేకుండా చేశారు. అమరావతి విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి జగన్ వ్యాఖ్యలను సానుకూలంగా మార్చే యత్నం చేశారు. గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితమైనప్పటికీ రాజధాని విషయంలో ఆయన వైఖరి మారలేదని ఇప్పుడు స్పష్టమైంది. రాజధాని అవసరమే లేదని చెబుతున్న జగన్ ,ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధీ జ్ఞానం లేవని ఆరోపించారు. అయితే అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కంటున్నారు. దక్షిణ్యాదికే తలమానికంగా రాజధాని నిర్మాణం కావాలని చంద్రబాబు ఉబలాట పడుతున్నారు. విమర్శలు ఎలా ఉన్నా ఇక ఉన్నది మూడేళ్ల కాలమే. ఈ లోగా రాజధాని నిర్మాణం పూర్తి చేసి తన సత్తా ఏమిటో చాటాలి. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి. అమరావతిని ఆవాసయోగ్యంగా మార్చగలిగితే ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడం ఎంత ముఖ్యమో ఇళ్ల నిర్మాణం జరగడం కూడా అంతే ముఖ్యం. రాజధాని అంటే కార్యాలయాలు మాత్రమే కాదు, ప్రజలతో కళకళలాడాలి. ఇందుకోసం ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలి. ఆవాస ప్రాంతాలలో పౌర సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అప్పుడే జనసాంద్రత పెరుగుతుంది.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

(మొదటి పేజి (తరువాయి))

డ్రాయింగ్ పోటీలు, గోళీలు, బొంగరాలు, చిల్లాకట్టే వంటి సాంప్రదాయ ఆటలు నిర్వహించగా, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్పీ స్వయంగా పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేసి , బొంగరాలు ఆటలలో అందరిలో ఆనందాన్ని నింపారు. కార్యక్రమం ముగింపులో వివిధ పోటీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి వారి పిల్లలకు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ దంపతులు, అడిషనల్ ఎస్పీ బహుమతులు అందజేశారు. పోలీస్ కుటుంబాలలో నూతనోత్సాహం నింపిన ఈ సంక్రాంతి సంబరాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ దంపతులతో పాటు, అడిషనల్ ఎస్పీ, ఐదు సబ్ డివిజన్లోని డీఎస్పీలు, సిఐలు ఎస్సైలు డిపిఓఏఆర్ పోలీస్ సిబ్బంది పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.












# గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

(మొదటి పేజి (తరువాయి))

ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది కోడి పందేలు. గ్రామీణ సంస్కృతిలో కోడి పందేలు, ఎడ్ల పందేలు కేవలం ఆటలు మాత్రమే కావు. అవి ఓ ఉత్సవం, ఓ వేడుకలా సాగుతాయి. ఈవీటి కోసం అప్పుడే బరులు సిద్ధం చేసుకున్నారు. భోగి నుంచి కనుమ వరకూ పల్లెల్లో జరిగే ఈ పందేలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాదు.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచీ జనం పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్న తెలుగువారిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందాయి. అక్కడి పందేల హడావిడి, ఏర్పాట్లు, గెలుపు ఓటముల ఉత్కంఠ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కొందరికి ఇది సంప్రదాయం, మరికొందరికి వినోదం, ఇంకొందరికి గెలుపు ఓటముల ఉత్కంఠ. ఈ పందేలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తుంది. అయితే.. ఇటీవలి కాలంలో కోడి పందేల్లో మనుషులు గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. కోడి కత్తులు ప్రేక్షకులకు తగలడం, గొడవలు జరగడం..



దీనివల్ల దాడులకు దిగడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ సంప్రదాయం ఇప్పుడు భద్రతా కోణంలో పెద్ద చర్చకు దారితీస్తోంది. కాబట్టి ఈ కోడి పందేల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# నారావారింట సంక్రాంతి



(మొదటి పేజి (తరువాయి))

గ్రామీణ క్రీడా పోటీలను సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు స్వయంగా వీక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, పిల్లలతో ఫొటోలు దిగి వారిలో ఉత్సాహం నింపారు. ఈ వేడుకల్లో నారా, నందమూరి కుటుంబాలకు చెందిన చిన్నారులు కూడా పాల్గొనడం విశేషం. సొంతూరులో పండుగ జరుపుకొంటూనే.. అటు కుటుంబ సభ్యులు, ఇటు సామాన్య ప్రజలతో సమయాన్ని గడుపుతూ.. సీఎం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయ హడావుడికి దూరంగా, గ్రామీణ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు స్థానికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. నారావారిపల్లెకు చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో స్కూల్‌కు చెందిన పిల్లలతో సీఎం చంద్రబాబు దంపతులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ క్రీడల్లో నారా, నందమూరి కుటుంబ చిన్నారులు పాల్గొనడం విశేషం. వీరిలో గెలుపొందిన వారికి ఇతర పిల్లలతో సమానంగా బహుమతులు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నారా దేవాన్ష్ పలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. పరదాల సంస్కృతికి పూర్తిగా భిన్నంగా, సొంతూరు నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. క్రీడా పోటీల అనంతరం ఇంటికి వెళ్లే మార్గమంతా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ అర్జీలు స్వీకరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రత్యేకంగా తరలివచ్చిన ప్రజలు కూడా చంద్రబాబుకు అర్జీలు అందజేశారు. సమస్యలు విన్న సీఎం చంద్రబాబు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించడం వంటి చర్యలు చంద్రబాబు ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచాయి. నారావారిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికంగా విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను భువనేశ్వరి, బ్రాహ్మణి పరిశీలించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ క్రీడా పోటీల్లో దేవాంశ్ పాల్గొన్నాడు. ఆయా పోటీలను సీఎం, కుటుంబసభ్యులు తిలకించారు. అనంతరం విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించారు.

# ఇండిగో అదిరిపోయే ఆఫర్

**విమాన ప్రయాణీకులకు ఇండిగో న్యూఇయర్ ఆఫర్స్. డొమెస్టిక్ వన్‌వే చార్జీలు కేవలం రూ 1499... ఆఫర్ 3రోజులు మాత్రమే.. బుక్ చేసుకున్న వారికి ఏప్రిల్ వరకు ప్రాణించే అవకాశం..**

విమాన ప్రయాణీకులకు ఇండిగో అదిరిపోయే ఆఫర్ ఇచ్చింది. ప్రయాణీకులను ఆకట్టుకొనేందుకున్యూ ఇయర్ సేల్‌ను ప్రారంభించింది. ఈ సేల్‌కు సాయిల్ ఇన్ టు 2026 అని పేరు పెట్టారు. ఈ ఆఫర్ కింద డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఫ్లైట్ టిక్కెట్లపై భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. ఈ ఆఫర్ లో భాగంగా డొమెస్టిక్ వన్-వే ఛార్జీలు కేవలం రూ.1,499 నుండి ప్రారంభం కానున్నాయి. అదే వెంగా అంతర్జాతీయ ఛార్జీలు రూ.4,499 నుండి ప్రారంభమవుతాయని ప్రకటించింది. ఇండిగో ప్రకటించి ప్లాన్ ప్రకారం ఈ ఆఫర్ జనవరి 13 నుండి జనవరి 16 వరకు ఓపెన్ ఉంటుందని వెల్లడించింది. కాగా, ఈ ఆఫర్ కింద బుక్ చేసుకున్న టిక్కెట్లు జనవరి 20 నుంచి ఏప్రిల్ 30 మధ్య ప్రయాణానికి చెల్లుబాటు కానున్నాయి. ఆఫర్ లో భాగంగా డొమెస్టిక్ ఫ్లైట్ వన్-వే ఛార్జీలు రూ.1,499, ఇంటర్నేషనల్ మార్గాలలో వన్-వే ఛార్జీలు రూ.4,499 నుండి ప్రారంభం కానున్నాయి. ఎక్కువ లెగ్‌రూమ్ సౌకర్యాన్ని అందించే ఇండిగో స్ట్రెచ్ సీట్లు ఎంపిక చేసిన డొమెస్టిక్ రూట్లలో రూ.9,999 నుండి ప్రారంభమవుతాయి. ఇక.. చిన్న పిల్లలతో ప్రయాణించే తల్లిదండ్రులకు బ్రహ్మాండమైన ఆఫర్ ఇచ్చింది. రెండేళ్లు అంతకంటే తక్కువ ఉన్నవారికి దేశీయ విమాన టికెట్‌ను కేవలం రూ.1కి బుక్ చేసుకోవచ్చని ప్రకటించింది. ఇక.. ఈ న్యూ ఇయర్ సేల్ టిక్కెట్లపై మాత్రమే కాకుండా అదనపు




సౌకర్యాలపై కూడా డిస్కౌంట్లు అందిస్తున్నట్లు వెల్లడించింది. కొన్ని 6జు యాడ్-ఆన్‌లు 70 శాతం వరకు తగ్గింపుతో లభిస్తాయి. ప్రీపెయిడ్ అదనపు బ్యాగేజీపై 50 శాతం వరకు తగ్గింపుతో పాటు, ఎంపిక చేసిన రూట్‌లలో స్టాండర్డ్ సీట్ సెలెక్షన్‌లపై 15 శాతం వరకు తగ్గింపుతో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎమర్జెన్సీ ఎక్సెల్ సీట్లు కూడా ఎంపిక చేసిన దేశీయ రూట్‌లలో రూ.500 నుండి ప్రారంభమవుతాయి. ఆఫర్ వినియోగించుకొనే వారు తమ టిక్కెట్లను ఇండిగో అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్,ఏఐ అసిస్టెంట్ 6ఎస్కాయ్ తో పాటుగా ఎంపిక చేసిన ట్రావెల్ పార్టనర్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని సూచించింది.

# చేతికి చిక్కనంటున్న చికెన్



(మొదటి పేజి (తరువాయి))

కొండెక్కి కూర్చుంది. ముఖ్యంగా క్రిస్మస్ పండుగ సందర్భంగా డిసెంబరు నెలలో భారీ స్థాయిలో విక్రయాలు సాగాయి. అనంతరం నూతన సంవత్సరంలో సైతం అదే ఒరవడి కొనసాగింది. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి ఉండడంతో మరింత పెరిగే ఆస్కారం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మధ్య తరగతి ప్రజలకు మటన్ కొనడమే భారంగా మారి, వారానికి ఒక్కసారి బాయిలర్ చికెన్ తో సంతృప్తి చెందుతున్నారు. వారాంతంలో పెరిగిన ధరలతో చేతికి చిక్కన్నంటున్న చికెన్ తో, ముక్క తగ్గనంటోంది, ముద్ద దిగనంటోంది, వారాంతంలోచికెన్ ముక్క లేకుంటే ముద్ద దిగేదెలా అంటున్న మధ్య తరగతి మాంసాహార ప్రియులు.

మాంసాహార ప్రియులకుచికెన్ ధరలు రోజురోజుకూ షాకిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కేజీ స్కిన్ లెస్ చికెన్ ధర రూ. 320కి చేరడంతో మాంసాహార ప్రియులు ముద్ద దిగడం లేదు. గత కొన్ని వారాలుగా ఉత్పత్తి తగ్గడం, పెరిగిన డిమాండ్ కారణంగానే ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. సంక్రాంతి కనుమ నేపథ్యంలో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. దీంతో మాంసాహార ప్రియులు దిగాలు చెందుతున్నారు. నూతన సంవత్సరం మొదలైన కొద్ది రోజులకే చికెన్ ధరలు ఆకాశాన్ని తాకాయి. గత మూడు నెలలుగా కిలోకు రూ.260 వద్ద స్థిరంగా ఉన్న బ్రాయిలర్ కోడి మాంసం ధర, కేవలం రెండు వారాల్లోనే ఏకంగా రూ.290కు చేరింది. ఇప్పటికే గుడ్ల ధరల పెరుగుదలతో సామాన్యుల జేబులకు చిల్లు పడుతుండగా, ఇప్పుడు చికెన్ ధరలు కూడా భారంగా మారాయి. సాధారణంగా ప్రతి ఆదివారం కొనుగోలు చేసే మధ్య తరగతి కుటుంబాలు కూడా ఇప్పుడు చికెన్ కొనాలంటే రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బ్రాయిలర్ మాంసం కిలో రూ.290గా ఉంది. ధరలు అనూహ్యంగా పెరగడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంక్రాంతి పండుగ శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో కోడి మాంసంతో వంటలు తప్పనిసరిగా ఉండే కుటుంబాలకు ఈ ధరలు భారంగా మారాయి. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన పేద కుటుంబాలు చికెన్ కొనుగోలు తగ్గించుకునే పరిస్థితి కనిపిస్తోంది. ధరలు పెరిగిన కారణంగా చాలామంది వారానికి ఒకసారి కొనుగోలు చేసే చికెన్, రెండు వారాలకు లేదా నెలకు ఒక్కసారి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో డిమాండ్ పెరగడం, అదే సమయంలో కోళ్ల ఉత్పత్తి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు దారి తీసిందని అంటున్నారు. దీంతో మార్కెట్లో సరఫరా తగ్గి ధరలు మరింత పెరిగాయి. రాబోయే రోజుల్లో కూడా ధరలు తగ్గే అవకాశం తక్కువగానే ఉంటుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తెలుగు వారి ఆచారం

(మొదటి పేజి (తరువాయి))

ఏరుకుంటారు. భోగి పీడ తొలగాలంటే శాస్త్రం ఒక ఉపదేశం చేసింది. అదేమిటంటే.. చెరుకు ముక్కలు, రేగు పండ్లు, పైసలు ఈ మూడింటిని కలిపి చిన్న పిల్లల్ని కూర్చోబెట్టి దిగదుడుపు తీసి తలపై నుంచి కిందకి వదిలేస్తారు. ఇలా చేయడం వల్ల భోగి పీడ తొలగిపోయి.. వాళ్లు భోగం అనుభవించడానికి కావల్సిన శక్తిని పొందుతారని నమ్మిక. సాధారణంగా చిన్న పిల్లలకు నర దృష్టి , గ్రహపీడ కలుగుతూ ఉంటుంది. చిన్న పిల్లల తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. కాబట్టి తలపై భోగి పండ్లు పోసి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది. అంతే కాకుండా భోగి పండ్లను విష్ణుమూర్తి స్వరూపంగా భావిస్తారు. కాబట్టి రేగి పళ్ళు పిల్లల తలపై పోయడం వల్ల శ్రీమన్నారాయణుడి ఆశీస్సులు లభిస్తాయని, పిల్లలపై ఉన్న చెడు దృష్టి తొలిగిపోతుందని చెబుతారు. అంతే కాకుండా సూర్యభగవానుడి ఆశీస్సులు పిల్లలకి ఉండాలనే సూచనగా కూడా ఈ భోగి పళ్లు పోస్తారు. ఇంకా రేగు పళ్ళతో పాటు బంతిపూల రెక్కలని కూడా వాడటం వల్ల పిల్లల చుట్టుపక్కల ఉండే క్రిములు మాయమైపోతాయట. క్రిములను చంపడమేనది బంతిపూలకి ఉన్న ప్రాథమిక లక్షణంగా చెబుతారు. అంతే కాకుండా చర్మ సంబంధమైన వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించే లక్షణం కూడా వీటికి ఉంటుందట

# బాధ్యత రాష్ట్రాలతే

(మొదటి పేజి (తరువాయి))

ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# బార్లు, షాపుల్లో మద్యం ఒకే ధర

(మొదటి పేజి (తరువాయి))

మద్యం సేవించే అవకాశం కూడా ఉంటుంది. దీంతో సంక్రాంతి వేళ బార్లతో పాటు మందుబాబులకూ ఊరట దక్కబోతోంది. రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న ఎక్సైజ్ విధానంలో ప్రభుత్వం ఇవాళ పలు మార్పులు చేసింది. దీని ప్రకారం గతంలో వైసీపీ హయాం నుంచి బార్లపై అమల్లో ఉన్న అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ను రద్దు చేశారు. దీంతో మద్యం షాపులతో సమానంగా బార్లలోనూ మద్యం ధరలు ఉండబోతున్నాయి. ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి బార్లకు సరఫరా చేసే మద్యంపై అదనపు పన్ను విధించడం లేదని ప్రభుత్వం ఇవాళ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు కొత్త నోటిఫికేషన్ జారీ చేశారు. బార్లకు లైసెన్స్ ఇచ్చే సమయంలో విధించే నిబంధనల్లో ఈ అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ కూడా ఒకటి. దీని వల్ల సాధారణ మద్యం షాపులతో పోలిస్తే బార్లలో మద్యం ధరలు ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ పన్నును రద్దుచేయడంతో రెండు చోట్లా ఒకే రేట్లకు మద్యం దొరకనుంది. అలాగే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బార్ల వ్యాపారులకు సైతం పెద్ద ఊరట కానుంది..

# ఆడబిడ్డ నిధి ఇచ్చేదెన్నడు

(మొదటి పేజి (తరువాయి))

దీపావళి, సంక్రాంతికి ఇస్తామని ఇంకొకరు ఆడబిడ్డల మనోభావాలతో ఆటలాడుతున్నారని షర్మిల ఫైర్ అయ్యారు. ఆడబిడ్డ నిధి పేరుతో కోటిన్నర మంది రాష్ట్ర మహిళలకు సీఎం చంద్రబాబు చేసింది ఘరానా మోసమే అన్నారు. నెలకిచ్చే 15 వందలతో ఏడాదికి 18 వేలు చేస్తాం అన్నారని, 18 వేలను లక్షా 50 వేలకు ఆదాయం పెంచే మార్గం చూపుతాం అన్నారని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధికి పెద్దపీట అంటూ చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి బూటకపు మాటలే అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఆడబిడ్డ నిధి ప్రధాన హామీ అని, 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు ఆర్థికంగా భరోసా నిచ్చే హామీ అని అన్నారు. ప్రతి ఏడాది 18 వేలు లబ్ధి చేకూరే పథకానికి రెండేళ్లుగా పంగనామాలు పెడుతూ .. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటినుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. నచ్చినప్పుడు, ఇష్టం ఉన్నప్పుడు అమలు చేసేవి కావు ఎన్నికల హామీలు అన్నారు. మహాశక్తి పథకాన్ని తక్షణం అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు.

# మళ్లీ సుప్రీం కోర్టుకి

(మొదటి పేజి (తరువాయి))

సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివేకా హత్య కేసులో దాదాపు ఆరేళ్లకు పైగా సుదీర్ఘంగా సాగిన సీబీఐ దర్యాప్తులో ఏమీ తేల్చలేకపోయారు. అంతేగాకుండా దర్యాప్తు ముగిసిందంటూ సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదిక ఇచ్చింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయన కుమార్తె ఈ కేసులో దర్యాప్తు మరింత లోతుగా చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కానీ సుప్రీంకోర్టు దీనిపై నిర్ణయం తీసుకోకుండా ఆమెను ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని పంపింది. దీంతో నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం, కోర్టు పాక్షిక సీబీఐ దర్యాప్తుకు అనుమతి ఇవ్వడం జరిగిపోయాయి. ఈ తీర్పుపైనా అసంతృప్తిగా ఉన్న సునీత ఇప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగించాలా లేక నాంపల్లి కోర్టు చెప్పినట్లుగా ఒకటి రెండు అంశాలపై మాత్రమే దర్యాప్తు చేయాలా అన్న దానిపై మళ్లీ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో సునీత పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. వచ్చే మంగళవారానికి దీన్ని వాయిదా వేసింది.

# రైలుపట్టాలపై ప్రసవం

**పార్వతీపురం (తెలుగోడు), జనవరి 13 :**

రైలు పట్టాలపై ఓ నిండు గర్భిణి ప్రసవించిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వారిని వెంటనే సమీప ఆస్పత్రిలో చేర్పించారు. వివరాల్లోకి వెళితే..ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన ప్రియ పాత్ర.. నిండు గర్భిణీ. కొద్ది రోజుల్లో ఆమెకు నెలలు నిండనున్నాయి. మంగళవారం ఉదయం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సూరత్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో రైలులో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో సహచర ప్రయాణికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని టీసీ ద్వారా గార్డుకు తెలియజేశారు. పార్వతీపురం సమీపంలోకి రైలు వచ్చే సరికి.. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో సమీపంలోని బెలగాం స్టేషన్ వద్ద రైలును అత్యవసరంగా నిలిపివేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, మహిళా ప్రయాణికుల సహాయంతో రైలు నుంచి ప్రియా పాత్రను కిందకు దింపారు. తర్వాత.. రైలు పట్టాల పైనుంచి ఆమెను దాటిస్తుండగా.. ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. ఇంతలో పట్టాలపైనే ఆమె ప్రసవమయింది. అనంతరం.. తల్లీబిడ్డను ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో ప్రియ పాత్ర కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## జెడ్ వీరారెడ్డి కాలనీలో సంక్రాంతి సంబరాలు

**గుత్తి (తెలుగోడు), జనవరి 13 :**
పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి నిర్మల నిర్వహణలో సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజులపాటు పిల్లలకి ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ , అధ్యక్షులు ప్రశాంత్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు ఓన్నరమ్మ, గంగాధర్ ,మహిళా సంఘం అధ్యక్షురాలు రేవతి, కమిటీ మెంబర్ ఊర్మిళ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్

## ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు సద్వినియోగం చేసుకోండి

**అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్..**

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ అన్నారు. యాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ వైద్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాసులు రెడ్డీ , పరమేష్ మాట్లాడుతూ ఈ కార్డు విశిష్ట విశిష్టత కలిగి ఉందని , ఒక వ్యక్తి ఆరోగ్యం గురించి , వాటి వివరాల గురించి ఈ కార్డు తెలుపుతుందని భారతదేశంలో ఎక్కడైనా గాని ఇది సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. దీనితో దాదాపు 5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. ఈ ఏథకానికి అర్హులైన వారు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మొదటిగా రాష్ట్రంలో యాడికి మండలం సెలెక్ట్ అయిందని దీనివల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు జిల్లా ఇన్చార్జి పరమేష్ నాయక్. జిల్లా నుండి వైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి. యాడికి వైద్యులు పరమేష్. సాయి సుమంత్ రెడ్డి. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మంపల్లి ఎస్సీ కాలనీ తాగునీటి సమస్య పరిష్కరించండి

**అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్‌కి వినతి పత్రం..**
**కాలనీవాసులు..**

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
యాడికి మండల పరిధిలోని చందన పంచాయితీలో ఉన్న లక్షుంపల్లి గ్రామం ఎస్సీ కాలనీ లో త్రాగునీటి సమస్యపై మంగళవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ కి వినతి పత్రం కాలనీవాసులు కంబగిరి రాముడు ఇచ్చారు. గ్రామంలో సుమారు 50 ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు జీవన సాగిస్తూ ఉన్నాం సుమారు రెండు సంవత్సరాల నుండి మా కాలనీ నందు త్రాగునీటి సమస్య ఉందని మండల స్థాయి అధికారుల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు మాకు త్రాగునీటి సమస్యను పరిష్కరించమని ఎన్నో అర్జీలు ఇచ్చినప్పటికీ మా గ్రామంలో ఎస్సీ కాలనీకి నీళ్లు ఇక్కడ ఉండే మండల సాయి అధికారులు ఇంతవరకు మా కాలనీలో పైపు లైను లేదు మాపై దయవుంచి తమరైన మా సమస్యను పరిష్కరించి మా కాలనీలోని ప్రజల నీటి సౌకర్యం కలిగించాలని మాకు తగు న్యాయం చేయగలరని కోరుతూ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ కి కాలనీవాసులు కంబగిరి రాముడు వినతి పత్రం సమర్పించారు.


అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

## గుమ్మనూరు కుటుంబం పేర దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదు.

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం..**

**గుత్తి (తెలుగోడు), జనవరి 13 :**
తన పేరు, తన కుమారుడు ఈశ్వర్ పేరుతో ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడి ప్రజల ఆస్తులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హెచ్చరించారు. మంగళవారం గుత్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా గుత్తి మండల కేంద్రంలో వివిధ వివాదాలు నెలకొంటున్నాయని తెలుగుదేశం పార్టీకి గాని తనకు గాని ఎటువంటి సంబంధం లేని కొందరు వ్యక్తులు తమ పేరుతో ప్రజల ఆస్తులను లాక్కోవడానికి చూస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దేవుడు తమను చల్లగా చూస్తున్నాడని ప్రజల ఆస్తులు కానీ ప్రభుత్వ ఆస్తులు గాని ఆక్రమించుకోవాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిందని వాటితో రోడ్ల నిర్మాణం తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెద్ద మొత్తంలో సీఎంఆర్ఎఫ్ నిధులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఇలాంటి తరుణంలో కానిస్టేబుల్ వాసు తమ పేరుతో పట్టణంలోని అనంతపురం రోడ్లో అక్రమాలకు పాల్పడితే వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అంతే తప్ప అందులో తాము ఎలాంటి దౌర్జన్యాలకు పాల్పడలేదన్నారు. తన పేరుతో గాని తన అనుచరుల పేరుతో గాని ఎవరైనా ప్రజల ఆస్తులను దోచుకున్న అక్రమాలకు పాల్పడిన అటువంటి వారికి తాటతీస్తానని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పత్రికలు పత్రిక విలేకరులు నియోజకవర్గంలో జరుగుతున్న వాస్తవాలను గుర్తించి వార్తలు రాయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

# యాడికిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ముగ్గుల పోటీల్లో 167 మంది పాల్గొనగా 17 మంది మహిళలకు నిర్వాహకులు బహుమతులను ప్రధానం చేశారు. మిగిలిన వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగరాగిణి హాజరైనారు. పోటీలకు తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమతి భూమా నాగరాగిణి, మిత్రబృందం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినారు.



ముగ్గుల పోటీలో మొదటి బహుమతి గెలిచిన నాగలక్ష్మీకి బహుమతి అందిస్తున్న దాత టిడిపి మండల కన్వీనర్ దడియాల

సంక్రాంతి హరితలక్ష్మి పోటీల్లో మొదటి బహుమతి ఎం నాగలక్ష్మి, రెండవ బహుమతి సరిత, మూడవ బహుమతి శరణ్య, నాలుగవ బహుమతి శిరీష , ఐదవ బహుమతి రేణుకా దేవి , ఆరవ బహుమతి వనజ , ఏడవ బహుమతి నాగలక్ష్మి , ఎనిమిదవ బహుమతి హేమలత , తొమ్మిదవ బహుమతి శ్రావణి , పదవ బహుమతి రాజేశ్వరి , 11వ బహుమతి అశ్విని , 12వ బహుమతి రాజి , 13వ బహుమతి వర్షిత , 14వ బహుమతి మాదాన ఈశ్వరి , 15వ బహుమతి జోష్ణ , 16వ బహుమతి బిందుమతి , 17వ బహుమతి మౌనిక గెలుచుకున్నారు.

గెలుపొందిన వారికి తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అస్మిత్ రెడ్డి తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమ నాగరాగిణి, దాతలు, శు భాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమానికి సహకరించిన స్పాన్సర్లు టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, డిపో రాజు అండ్ ఫ్రెండ్స్, నాయుడు, స్టోర్ డీలర్ల సంఘం, జనసేన సునీల్ కుమార్,టెన్సింగ్ నాయుడు, తిరం పురం నీలకంఠ గుండా నారాయణస్వామి, కూన వెంకటస్వామి గన్నే రమేష్, వంగనూరు రాజశేఖర్,స్టాంపుల సూరి, దేవేంద్ర నాయుడు,సునీత పట్టు వస్త్రాలయం, వద్ది రాజశేఖర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఇండ్ల నందగోపాల్, వెలిగండ్ల ఆదినారాయణ ,వెలిగండ్ల ఉపేంద్ర . చంద్రశేఖర్ రెడ్డి,మారుతి సెల్ పాయింట్,వంకం నాగమయ్య, కుమ్మెత నాగేంద్ర, మారుతి ఎలక్ట్రానిక్స్, విశ్వం, నరేంద్ర డెకరేషన్స్,కడ్డీల నాగేంద్రకి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


యాడికిలో సంక్రాంతి ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి



ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

# బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

**అధికారులతో సమీక్ష సమావేశం..**
**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం..**

**గుత్తి (తెలుగోడు), జనవరి 13 :**
బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశించారు. మండల పరిధిలోని తొండపాడు గ్రామంలో వచ్చే నెల 1వ తేదీ జరగబోయే బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు యువనేత గుత్తి , పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా


ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


తొండపాడు రంగనాథ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయరాం, ఈశ్వర్

ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టదిద్దమైన ఏర్పాట్లు చేయాలని అదేశించారు. ఇక్కడకు వచ్చే వేలాదిమంది భక్తాదులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య గాని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు గుత్తి పట్టణం, మండల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు మరియు అనుబంధ కమిటీ సభ్యులు తొండపాడు గ్రామ ప్రజలు హాజరయ్యారు.
ముందుగా శ్రీ బొలికొండ రంగనాథ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సిపిఐ శత వార్షికోత్సవం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

## చలో ఖమ్మం పోస్టర్ విడుదల

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
ఖమ్మంలో ఈనెల 18న జరిగే శత వార్షికోత్సవాలకు సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సిపిఐ సీనియర్ నాయకులు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, నారాయణ ,లింగన్న, సీపీఐ మండల కార్యదర్శి వెంకట రాముడుయాదవ్ అధ్వర్యంలో వడుగూరు సీపీఐ కార్యాలయములో కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఐ శతజయంతి ఉత్సవాలు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుగుతాయన్నారు. పెద్దవడుగూరు మండలవ్యాప్తంగా సీపీఐ అనేక ఉద్యమాలు పేద బడుగు బలహీనవర్గాల కోసం, రైతాంగ సమస్యల కోసంపెద్దఎత్తున పోరాటాలు కోనసాగిస్తున్నామన్నారు. సీపీఐఎర్రజెండా నిత్యము ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేస్తోందన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 సంవత్సరంలో అడుగు అడిగిన సందర్భంగా ఖమ్మంలో గొప్ప బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారన్నారు. సిపిఐ అభిమానులు రైతులు, కూలీలు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు హుస్సేన్ పీరా, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఓం నారాయణ, సి. నాగేంద్ర, కిరణ్, దౌల, గఫూర్, మల్లికార్జునయ్య, నాగేంద్ర,శేఖర్ రెడ్డి,నాగేంద్ర పాల్గొన్నారు.

# తొండపాడులో సీసీ రోడ్లకు భూమిపూజ

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం..**

**గుత్తి (తెలుగోడు), జనవరి 13 :**
గుత్తి మండల పరిధిలోని తొండపాడు గ్రామంలో మంగళవారం సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అందులో భాగంగానే



తొండపాడులో సిసి రోడ్డు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు


తొండపాడు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

రాష్ట్ర వ్యాప్తంగా నూతన సీసీ రోడ్లుకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. గుత్తి మండలం అభివృద్ధిలో భాగంగా 8 లక్షల రూపాయలతో సిసి రోడ్డుకు భూమి పూజ చేశామన్నారు.
గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ గుత్తి మండలాన్ని అన్నిరంగాల్ల అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు సంబంధిత అధికారి యంత్రాంగం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త ఈశ్వరయ్య మృతి

**ఆత్మకూరు (తెలుగోడు), జనవరి 13 :**
మండల పరిధిలోని సనప గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త బావికాటి ఈశ్వరయ్య మంగళవారం హైదరాబాదులో అనారోగ్యంతో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో మూలపడిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి విశేష కృషి చేశారు. గుడి దగ్గరికి వెళ్లాలంటే కూడా భయంతో వెళ్లలేని స్థితిలో ఉన్న గుడిని ఆయన స్వయంకృషితో సొంత డబ్బుతో గుడికి గోపురాన్ని



కట్టించారు. ఆలయం లోపల టైల్స్ వేయించి సుందరీకరణ చేయించారు. పెళ్ళివంటి శుభ కార్యాలకోసం గదులు, వంటశాల ఏర్పాటు, గుడి చుట్టూ కాంపౌండ్ ఏర్పాటు, రాగి చెట్టుకు కట్ట ఏర్పాటు, గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి బండలు పరచడం వంటి పనులు చేయించారు. గుడికి వెళ్లడానికి రహదారి ఏర్పాటు చేయించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించారని గ్రామస్తులు తెలిపారు.

# సంక్రాంతి పండుగ వేళ పోలీసుల కఠిన హెచ్చరిక

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
సంక్రాంతి పండుగను ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు యాడికి మండలంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో యాడికి సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, జూదం లేదా కోడి పందేలు నిర్వహించినా, వాటిలో పాల్గొన్నా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మండలం పరిధిలో ఎలాంటి జూద కార్యకలాపాలకు అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పండుగ పూట అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి చట్టానికి సహకరించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు ఎగరేసేటప్పుడు విద్యుత్ తీగల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని పేర్కొన్నారు. పండుగ వాతావరణాన్ని చెడగొట్టే చర్యలకు పాల్పడకుండా, కుటుంబ సభ్యులతో సురక్షితంగా పండుగను జరుపుకోవాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది. శాంతియుతంగా సంక్రాంతిని నిర్వహిస్తేనే సంప్రదాయ పండుగకు నిజమైన అర్థం ఉంటుందని అధికారులు తెలిపారు.



# జాయింట్ కలెక్టర్, ఎస్పీని కలిసిన పరిటాల శ్రీరామ్

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 13 :**
అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ లతో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. మంగళవారం అనంతపురంలో క్యాంప్ కార్యాలయానికి వచ్చి జేసీని ఆయన ఛాంబర్ లో కలిశారు. తాజాగా ఆయన శ్రీ అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో శ్రీరామ్ కలిశారు. జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల అభివృద్ధికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను పుట్టపర్తిలోని ఎస్పీలో కార్యాలయంలో కలిశారు. ధర్మవరం నియోజవర్గంలోని పలు అంశాల గురించి చర్చించారు. శాంతి భద్రతల విషయంలో తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని శ్రీరామ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ను కూడా పరిటాల శ్రీరామ్ కలిశారు. ఆయన సీజీఎంగా పదోన్నతి పొందగా.. పుట్టపర్తి లోని సాయి ఆరామంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సంపత్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. జిల్లాలో విశేషమైన సేవలందించారని.. ఇందుకు ప్రజల తరుపున శ్రీరామ్ కృతజ్ఞతలు చెప్పారు. జేసీ, ఎస్పీ, ఎస్ఈలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు కూడా తెలిపారు.



# యోగి వేమన జయంత్యుత్సవాలకు వెంకయ్య నాయుడుకు ఆహ్వానం

**కదిరి (తెలుగోడు), జనవరి 13 :**
కదిరి తాలూకా కటారుపల్లిలోని యోగి వేమన సమాధి వద్ద ఈనెల 19న ఘనంగా నిర్వహిస్తున్న యోగి వేమన జయంత్యుత్సవాలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ని నెల్లూరులోని స్వర్ణ భారతి ట్రస్ట్ కార్యాలయంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , కవి, పాత్రికేయుడు డాక్టర్ ఉద్దండం చంద్ర శేఖర్, ప్రజా గాయకుడు సుధాకర్ కలిసి ఆహ్వానపత్రిక అందించారు.



# మహిళా సాధికారతే సమ సమాజానికి పునాది

## ఘనంగా మహిళ విమోచన దినోత్సవం..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 13 :**
మహిళల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగే పోరాటమే సమాజ అభివృద్ధికి మూలమని, మహిళ సాధికారతతోనే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వక్తులు ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని పొట్లమరి గ్రామంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో భరతనారి శక్తికి నిదర్శనమైన ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, విద్యాదాత సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాటి వీరనారిలా త్యాగాలు, పోరాట పట్టిమ నేటి తరం మహిళలకు దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. బీఎస్పీ నియోజవర్గ ఇన్చార్జి సాకే వినయ్ కుమార్, మహిళ నాయకురాలు శైలం ఆదిలక్ష్మి ఈ సభలో మహిళలపై జరుగుతున్న సామాజిక వివక్షత పై లోతైన చర్చ జరిపారు. మహిళలకు చట్టసభల్లో, ఉద్యోగాల్లో సమాన వాటా దక్కాలని వారు డిమాండ్ చేశారు. డి.ఎస్.పి నియోజకవర్గ కార్యదర్శి బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి సాకే హరి మాట్లాడుతూ.. మహిళల హక్కుల పరిరక్షణకు, వారి ఆత్మగౌరవ పోరాటాలకు డిఎస్పి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు తమ సమస్యలను బిఎస్పి



మహిళ సంఘ సంస్కర్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిఎస్పీ నేతలు

దృష్టికి తెచ్చారు. తమకు కనీస ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనాలను పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సాకే వినయ్ కుమార్ మహిళలకు స్వీట్లు పంపిణీ చేసి మహిళా విమోచన దినోత్సవాన్ని ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుల్లాయప్ప, సుశీలమ్మ, ఆదిలక్ష్మి, వెంకటమ్మ, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్త సుకన్య, నరసమ్మ, బిఎస్పి నాయకులు, మహిళా వర్కర్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

## సంక్రాంతి కానుక అందించిన టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉమ్మల చంద్రశేఖర్..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 13 :**
గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమోఘమని, వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పలువురు టిడిపి నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం బత్తలపల్లిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉమ్మల చంద్రశేఖర్ సొంతంగా బత్తలపల్లి పంచాయతీలో పనిచేస్తున్న 11 మంది పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఏడుగురు మహిళా కార్మికులకు ఉప్పాడ పట్టు చీరలు, నలుగురు పురుషులకు పాంట్లు, షర్టులను టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముళ్ళగూరు అయ్యప్ప చేతుల మీదుగా నూతన వస్త్రములను అందజేశారు. ఈ సందర్భంగా దాత టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కేవలం నెలకు రూ 6వేల రూపాయలు జీతాలు చెల్లిస్తున్నారని కేవలం రోజుకి 200లకే కష్టతరమైన పనులు చేస్తూ కుటుంబాలు గడవని దుస్థితిలో జీవనం గడుపుతున్నారన్నారు. నేడు ఏ పనికి వెళ్లిన రోజుకు 500 రూపాయలు తక్కువ కాకుండా ఇవ్వనిదే పనులు చేయడం లేదన్నారు.వీరి దుస్థితిని చూసే కూటమి ప్రభుత్వం నెలకు 12వేలు రూపాయలు



పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

చెల్లించాలని జీవో కూడా విడుదల చేసిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కార్మికులకు పెంచిన జీతాలు జీవోను వెంటనే పరిశీలించి పెంచిన జీతాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర నాయుడు,మండల ఉపాధ్యక్షులు గరిశనపల్లి రవి, బాలాంజినేయులు యాదవ్,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తిక్కస్వామి,ప్రధాన కార్యదర్శి అక్కిం వెంకటేశ్,బీదాల నారాయణస్వామి, మండల సదాశివ,వడ్డే బొజ్జప్ప,బత్తుల మనోజ్, దేరంగుల హరి, మండల రాము తదితరులు పాల్గొన్నారు

# గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని దీపికకు ఆహ్వానం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 13 :**
గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావాలని భారత్ మహిళల అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు రాష్ట్రపతి భవనం నుండి ఆహ్వాన పత్రిక వచ్చింది. మడకశిర పోస్టల్ ఇన్స్పెక్టర్ జిలాన్ బాష, పోస్టల్ ఉమెన్ దివ్యభారతి, హాస్టల్ సిబ్బంది చంద్రమౌళి, కే. నారాయణ మూర్తి ఆహ్వాన పత్రికను



దీపికకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న మడకశిర పోస్టల్ ఇన్స్పెక్టర్ జిలాన్ బాష, పోస్టల్ ఉమెన్ దివ్యభారతి హేమావతి పోస్టల్ సిబ్బంది

దీపికకు స్వయంగా అందించారు. అమరాపురం మండలం హేమావతి పంచాయితీ తంబాలహట్టి గ్రామంలో దీపిక స్వగృహానికి వెళ్లి స్వయంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. భారతదేశానికి ఖ్యాతి తెచ్చిన అంధుల ఆణిముత్యం మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు సన్మానాలు, విశేష సత్కారాలు, పురస్కారాలు అందుతున్నాయి.




క్రికెట్ కెప్టెన్ దీపికకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న మడకశిర తపాలా శాఖ ఇన్స్పెక్టర్ జిలాన్ బాష

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, దీన్ని అదృష్టంగా భావిస్తున్నానని దీపిక అన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**అమరాపురం (తెలుగోడు), జనవరి 13 :**
మండల పరిధిలో ఊదుగురు గ్రామానికి చెందిన రైతే వీరేష్ (38) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన సిద్దేశ్వరప్ప కుమారుడు వీరేష్ 5 ఎకరాల పొలంలో బోరు వేసి వక్క, దానిమ్మ పంటలు సాగు చేస్తున్నాడు. దీనికి దాదాపు 18 లక్షల దాకా అప్పుల చేసినట్లు తెలుస్తోంది. అప్పుల బాధ అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఉన్న



రైతు వీరేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు.



రైతు వీరేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి

బాత్రూంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కే. నరసింహామూర్తి, మాజీ సర్పంచ్ ప్రకాష్, రఘు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు వీరేష్ భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ విషయాన్ని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లకు తెలియజేసినట్లు నాయకులు పేర్కొన్నారు.మృతుడి కుటుంబానికి ప్రభుత్వం మరియు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు భరోసా ఇచ్చారు.



శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి పూలతో అలంకరణ. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు హరీష్ బట్టర్

# వైభవంగా ధనుర్మాస పూజలు

**అమరాపురం (తెలుగోడు), జనవరి 13 :**
అమరాపురంలో వెలసిన శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాల్లో మంగళవారం ధనుర్మాస పూజలు శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి అర్చకులు శ్రీనిధి బట్టర్ అభిషేకం, పుష్ప అలంకరణ, మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి అర్చకులు హరీష్ బట్టర్ అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, పూలతో అలంకరణ వచ్చిన భక్తాదులకు మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధనుర్మాసం సందర్భంగా ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి ప్రత్యేకంగా ఆర్యవైశ్య మహిళలు భక్తి గీతాలు, పాటలు వినిపించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు.



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవికి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు. ప్రసాదం అందిస్తున్న దృశ్యం



ఇంటింటి బాలికల సర్వేలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎంఆర్ శివకుమార్

# బాలికల గుర్తింపుకు ఆశావర్కర్ల ఇంటింటి సర్వే

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎంఆర్ శివరాములు..

**అగళి (తెలుగోడు), జనవరి 13 :**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారుల ఆదేశాలతో మంగళవారం మండలంలో యుక్త వయస్సు బాలికలకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్లు వయసు పూర్తికాని బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్‌పివీ టీకా వేసేందుకు ఇంటింటికి వెళ్లి ఆశా వర్కర్లు సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఎం పాళ్యం గ్రామంలో ఆశా వర్కర్లు మహాలక్ష్మి, లక్ష్మీ, గంగమ్మ, పుష్పవతి తదితరులు ఇంటింటి సర్వే చేశారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎం ఆర్ శివరాములు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడికి వెళ్లే అమ్మాయిలను గుర్తించి వారి పుట్టిన తేదీ,ఆధార్ కార్డు,తల్లిదండ్రుల పేర్లు,ఫోన్ నంబర్లను తదితర వివరాలను సేకరించి నివేదికలను తయారు చేసి జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులకు పంపుతారని అన్నారు. దీంతో 15 ఏళ్ళు ఉన్నవారికి త్వరలో ఉచితంగా హెచ్ పి వి వ్యాక్సిన్ వేయనున్నట్లు వారు తెలిపారు.

# బత్తలపల్లిలో ఉమ్మడి జిల్లాల కబడ్డీ టోర్నమెంట్

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 13 :**
బత్తలపల్లిలో ఈనెల 21 నుంచి రెండు రోజులు పాటు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించే హజరత్ హిమాం ఏ కాశీం గంధం ఉత్సవాలను పురష్కరించుకుని ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు హాజరత్ ఏ హిమాం కాళీం ట్రస్ట్ నిర్వహకులు ముత్తుం కాశింవలి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 21వ తేదీ సబ్ జూనియర్స్ బాలుర విభాగం మ్యాచ్లు నిర్వహించబడుతుందన్నారు. 16 సంవత్సరాలలోపు, 55 కేజీలలోపు బరువు ఉండాలన్నారు. సీనియర్స్ విభాగంలో వయస్సుతో సంబంధం లేకుండా 85 కేజీలలోపు బరువు ఉండాలన్నారు. వీరు మాత్రమే టోర్నమెంటుకు అర్హులన్నారు. ప్రైజ్ మనీ పురుషుల విభాగంలో మొదటి బహుమతి రూ. 15 వేలుతో పాటు విన్నర్స్ ట్రోఫీ, రెండవ బహుమతి రూ 10వేలుతో పాటు రన్నర్స్ ట్రోఫీ, మూడవ బహుమతి, నాల్గవ బహుమతి కింద ఒక్కొక్క జట్టుకు రూ.5 వేలుతో పాటు జాయింట్ విన్నెర్స్‌గా ప్రకటిస్తామన్నారు. జూనియర్స్ విభాగంలో ఇదే పద్ధతి ఉంటుందన్నారు. పోటీలో పాల్గొనే జట్లు ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోపు మీ జట్టు పేరును నమోదు చేసుకోవాలని కోరారు. జూనియర్స్ విభాగంలో 12 జట్టును ఆహ్వానించడం జరిగిందన్నారు. సీనియర్స్, విభాగంలో మాత్రమే రూ.500లు ఎంట్రీ ఫీజు చెల్లించి జట్లు పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9100345930, 8522991983 నెంబర్లులో సంప్రదించాలని ఆయన కోరారు.



విజేతలకు ప్రోత్సాహక నగదు అందిస్తున్న జడ్పీటీసీ అనంతరాజు

# క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

## జడ్పీటీసీ అనంతరాజు..

**రొళ్ల (తెలుగోడు), జనవరి 13 :**
గెలుపోటములు సమానంగా తీసుకోవాలని జడ్పీటీసీ అనంతరాజు తెలిపారు. మండల పరిధిలోని ఎం.రాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి వేడుకల సందర్భంగా ఎం.రాయపురం టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం ఫైనల్ మ్యాచ్ పోటీల్లో ఎం.రాయపురం జట్టు కర్ణాటక రాష్ట్రం మధుగిరి జట్టు పై తలపడగా 38 పరుగుల తేడాతో మధుగిరి జట్టు విజయం సాధించింది.. విన్నర్ జట్టుకు స్థానిక జెడ్పిటిసి అనంతరాజు రూ.15వేలు నగదుతో పాటు ట్రోపి అందజేశారు.. అలాగే రన్నర్ జట్టుకు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రూ.7,500 నగదు, ట్రోఫీ అందజేశారు.. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహ రెడ్డి, నాయకులు బో?జెగౌడు,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్, సర్పంచ్ నరసింహప్ప, వైఎస్ సర్పంచ్ రవి, వార్డు మెంబర్ వజీర్ షేక్, క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు.. ఈసందర్భంగా క్రీడాకారులు జడ్పీటీసీ అనంతరాజు ను ఘనంగా సన్మానించారు.



మైదానాన్ని శుభ్రం చేయిస్తున్న పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్

# రంగవల్లుల పోటీకి మైదానం సిద్ధం

## పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్..

**అగళి (తెలుగోడు), జనవరి 13 :**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించనున్న రంగవల్లుల (ముగ్గుల) పోటీకి మైదానాన్ని మంగళవారం పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్, డిప్యూటీ ఎంపీడీవో పద్మల ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎగుడు దిగుడుగా ఉన్న మైదానాన్ని చదును చేసి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ పాల్గొన్నారు



మైదానాన్ని శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మాట్లాడుతున్న సొసైటీ ఛైర్మన్ మీసేవ ఆంజనేయులు

## మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు

**సొసైటీ ఛైర్మన్ మీసేవ ఆంజనేయులు ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 13 :**
పెద్దకడబూరు గ్రామంలోని సొసైటీలో స్వల్ప, ధీర్ఘకాలిక రుణాలు తీసుకొని చాలా సంవత్సరాలుగా చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని సొసైటీ ఛైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరు సొసైటీలో సీఈవో మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ మీసేవ ఆంజనేయులు ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే సొసైటీ ద్వారా రైతులకు కోటి రూపాయలు ధీర్ఘకాలిక రుణాలు అందజేశామని తెలిపారు. గతంలో సొసైటీ ద్వారా ధీర్ఘకాలిక రుణాల కింద రూ 50 లక్షలు పొందిన రైతుల నుంచి వడ్డీ వసూలు చేసి రెన్యూవల్ చేశామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మరో కోటి రూపాయలు ధీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలని జిల్లా కేడీసీసీ చైర్మన్ కు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గోనుమాను నరసన్న, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## రహదారిని కాపాడండి

**తహశీల్దార్‌కు రైతుల విన్నపం**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 13 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ సమీపంలో ఉన్న సూగూరు మేజరు కాలువ నుంచి ఎదలగట్టు పొలాలకు వెళ్లే రహదారిని కాపాడాలని మంగళవారం కల్లుకుంట గ్రామ రైతులు పెద్దకడబూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు జాన్, ఈరన్న, అల్లప్ప, అబ్రహం మాట్లాడుతూ గతంలో ఈ రహదారిపై పొలాలకు ఎద్దుల బండ్లు వెళ్లేవన్నారు. కానీ నేడు రహదారిని ఇరువైపుల ఉన్న రైతులు ఆక్రమించి ఇరుకుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున తక్షణమే అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తిక్కన్న, లసుమన్న, ఉరుకుందప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంకు వద్ద అదనపు కరెంట్ మోటర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## తాగునీటి సమస్య పరిష్కారానికి కరెంట్ మోటర్ ఏర్పాటు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 13 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంకు వద్ద అదనంగా కరెంట్ మోటర్ ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఉన్న ఒకే కరెంట్ మోటర్ వలన ఇబ్బందులు తలెత్తకుండా మేకడోణ గ్రామ పంచాయతీ నిధులతో అదనపు కరెంట్ మోటర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, టీడీపీ నాయకులు హజరత్ వలి గౌస్ మోదీన్ పటేల్, వడ్ల ఖాజా, వైసీపీ నేత నారాయణ స్వామి, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసీపీ నాయకులు

## మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

**మానవత్వం చాటుకున్న వైసీపీ నేతలు..**

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 13 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన వడ్డే సుంకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మత్స్య శాఖ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు పెద్ద వీరేష్, గ్రామ వైసీపీ నాయకులు తెలుగు చిన్న వీరేష్, లింగన్న గౌడ్, చాకలి నారాయణ, చాకలి ఉసేని, మాల వీరేష్, యోహాను, కామవరం అమరేష్ వడ్డే సుంకమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చుల కోసం రూ. 5 వేలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శాంతప్ప, బసలదొడ్డి శరణ, రాజు, సంగటి ఉసేని, వడ్డే భీముడు, గుండాలి మహదేవ, గోసలి మహదేవ తదితరులు పాల్గొన్నారు.

## గుండ కుటుంబ సభ్యులకు ఫోన్లో సీఎం పరామర్శ

**నారావారిపల్లి (తెలుగోడు), జనవరి 13 :**
మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆదర్శవంతమైన రాజకీయాలు చేశారని, పార్టీకి ఆయన చేసిన సేవలు ఎప్పుడూ మరిచిపోనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుండ కుటుంబం పట్ల తనకు అత్యున్నత గౌరవం ఉందని తెలిపారు. తలకు గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అప్పల సూర్యనారాయణ నిన్న ప్రాణాలు విడిచారు. శోకసంద్రంలో ఉన్న గుండ సభ్యులతో సీఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పల సూర్యనారాయణతో తనకు ఉన్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఆయన సాధారణ జీవితం గడిపారని అన్నారు. నిజాయితీగా ఎంతో ఆదర్శవంతమైన రాజకీయాలు చేశారని కొనియాడారు.

# ఎస్ఐ నిరంజన్ రెడ్డిని అభినందించిన టీడీపీ నేతలు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 13 :**
రాష్ట్ర అత్యుత్తమ పోలీసు స్టేషన్ అవార్డు పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌కు దక్కడానికి కృషి చేసిన ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఏఎస్ఐ శివరాములును టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు, ఆర్టీఎస్ తాలూకా కన్వీనర్ దశరథ రాముడు, టీడీపీ సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, చిన్నతుంబళం టీడీపీ గ్రామ అధ్యక్షులు నరసింహులు, టీడీపీ నాయకులు ఏక హనుమంతు, చంద్ర గంగులపాడు బాషా ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఏఎస్ఐ శివరాములుకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్ కు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అభినందించారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని పోలీసుల



ఎస్ఐ నిరంజన్ రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న

పని తీరుతో క్రైమ్ రేటు తగ్గడంపై ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నకేశవ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అత్యుత్తమ అవార్డు పొందిన ఎస్ఐ నిరంజన్ రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

# ఆదోని జిల్లా ఏర్పాటుకు మంత్రుల నుంచి సానుకూల సంకేతాలు

**ఆదోని జిల్లా విషయంపై ముఖ్యమంత్రి మంత్రులతో మూడు సార్లు చర్చించటం ఆదోని ప్రజా పోరాటాల ఫలితం.. జేఏసి నేతల హర్షం..**

**ఆదోని (తెలుగోడు), జనవరి 13 :**
ఆదోని జిల్లా ఏర్పాటు చేసేంత వరకూ ప్రజా ఉద్యమం తప్పదని జేఏసి నాయకులు అన్నారు. ప్రజలు మరింత చురుకైన పాత్ర పోషించాలని పిలుపులినిచ్చారు. ఆదోని ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఆదోని జిల్లా ఏర్పాటు కోసం ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ బిటి నాయుడు ఆధ్వర్యంలో మరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నూతన జిల్లాల ఏర్పాటు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కలిసి ఆదోని జిల్లా ఆవశ్యకత గురించి వినతి పత్రం అందజేశారు. ఆదోని జిల్లా కావాలని డిమాండ్ చేస్తూ ఆదోనితో సహా ఐదు నియోజకవర్గాల ప్రజలు రెండు నెలలుగా దీక్షలు చేస్తూ పోరాడుతున్న వైనం గురించి వివరిస్తూ సెంటిమెంటు బలంగా ఉన్నందున జిల్లా ఏర్పాటు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి, పార్టీలకు జరగబోయే రాజకీయ నష్టం గురించి వివరించారు.

దీనికి మంత్రి బదూలిస్తూ ఆదోని జిల్లా ఏర్పాటు విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా చర్చిస్తోందన్నారు. స్వయంగా ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు మంత్రుల కమిటీతో ఆదోని జిల్లా ఏర్పాటు విషయం పై మూడు సార్లు చర్చించినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ముఖ్యమంత్రి మరోసారి చర్చిస్తామని తెలపటం హర్షణీయం అని పేర్కొన్నారు. గతంలో జేఏసి నాయకులు ఉపసంఘం మరో సభ్యులు కర్నూలు జిల్లా ఇన్ చార్జి మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. ముఖ్య మంత్రి సైతం ఆదోని జిల్లా ఏర్పాటు విషయం పై చర్చించటం ఆదోని ప్రాంత ప్రజల పోరాట ఫలితమే తప్ప మరొకటి కాదు అని మనవి చేస్తున్నామని అన్నారు. ఆదోని జిల్లాను పోరాటాల ద్వారా మాత్రమే సాధించగలమని ,జిల్లా సాధన కై ప్రజలు ఇంతవరకూ చక్కని పోరాట పటిమ చూపారని పేర్కొన్నారు. ఆదోని జిల్లా కావడానికి అన్ని అర్హతలూ ఉన్నాయి,

ఆదోని ప్రాంత అభివృద్ధికి ఆదోని జిల్లా ఏర్పాటే దిక్కు కాబట్టి ప్రభుత్వం నుండి ఆదోని జిల్లా ఖచ్చితంగా ఏర్పాటు చేస్తామనే హామీ వచ్చేవరకూ ఉద్యమం సాగుతుందని అన్నారు. కావున రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు జేఏసి తరపున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు రఘురామయ్య, అశోకానంద రెడ్డి, నూర్ అహ్మద్, లలిత, వీరేష్,భూపేష్, కమతం వెంకటేష్, కృష్ణ మూర్తి గౌడ్, దస్తగిరి నాయుడు, సత్యనారాయణ రెడ్డి, హనీఫ్,సత్యన్న, కుంకనూరు వీరేష్ పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



విరాళాన్ని ఆలయ అధికారులకు అందిస్తున్న భక్తులు

## శ్రీశైలం అన్నప్రసాద పథకానికి విరాళం

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 13 :**
శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివర్ల నిత్య అన్న ప్రసాద పథకానికి హైదరాబాద్ కు చెందిన జి విజయ కుమారు లక్ష ఒక రూపాయి విరాళంగా అందించారు ఈ విరాళాన్ని ఆలయ అధికారులు స్వీకరించి విరాళానికి సంబంధించిన రసీదు తో పాటు స్వామి అమ్మవార్ల లడ్డు ప్రసాదాలను ఇచ్చి దాతను ప్రోత్సహించారు.



## భీమవరంలో పారామోటార్ అడ్వెంచర్ ప్రారంభం

**భీమవరం (తెలుగోడు), జనవరి 13 :**
సంక్రాంతి పండుగ వేడుకల్లో సంప్రదాయంతో పాటు వినోదం కూడా ఉండాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపాధ్యక్షుడు కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. భీమవరంలో ప్రజలకు కొత్త అనుభూతి అందించేందుకు పారామోటార్ ఏరియల్ అడ్వెంచర్ స్కై రైడ్‌ను జువ్వలపాలెం రోడ్, పెద్దఅమీరం, కాళ్ళ మండలం పరిధిలోని మిత్ర హాస్పిటల్ ఎదురు మైదానంలో మంగళవారం ప్రారంభించారు. వేడుకను ప్రత్యేకంగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తొలి స్కై రైడ్ చేశారు. దీంతో యువతతో పాటు స్థానిక ప్రజల్లో ఉత్సాహం పెరిగింది. కార్యక్రమంలో మాట్లాడిన రఘురామ కృష్ణంరాజు, సంక్రాంతి సందర్భంగా నిర్వహించే సంప్రదాయ పోటీలతో పాటు ఈ తరహా అడ్వెంచర్ కార్యక్రమాలు పండుగ ఆనందాన్ని మరింత పెంచుతాయని తెలిపారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ స్కై రైడ్స్ నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, భీమవరానికి సంప్రదాయ పండుగలతో పాటు అడ్వెంచర్ టూరిజాన్ని పరిచయం చేస్తున్నామని చెప్పారు. తన స్కై రైడ్ అనుభవం ఎంతో ఉత్సాహభరితంగా, మర్చిపోలేనిదిగా ఉందన్నారు. యువత, పిల్లలు భద్రతతో నిర్వహిస్తున్న ఈ స్కై రైడ్స్‌లో పాల్గొనాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు నాలుగు పారామోటార్ స్కై రైడ్స్ నిర్వహిస్తామని, ఇవి గరిష్ఠంగా 600 మీటర్ల ఎత్తుకు చేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చక స్వాములు .



ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వస్తున్న ఆలయ అధికారులు .



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం.

# భృంగి వాహనంపై విహరించిన శివపార్వతులు

## శ్రీశైలంలో వైభవంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు..

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 13 :**
మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహా క్షేత్రంలో పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహించే సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో రెండవ నాడైన మంగళవారం నాడు శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగానే యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణంకోసం జపాలు, పారాయణలు చేయడం జరిగింది. తరువాత మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం కార్యక్రమాలను ఆగమశాస్త్రం ప్రకారంగా అర్చక స్వాములు నిర్వహించారు . సాయంకాలం ప్రదోషకాలపూజలను, హోమాలను జరిపించిన తరువాత జపానుష్టానాలు నిర్వహించారు.

**భృంగివాహన సేవ..**

బ్రహ్మోత్సవాల వాహన సేవల్లో భాగంగా సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు. శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకారమండపంలో భృంగివాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. తరువాత శ్రీశైల పురవీధులలో గ్రామోత్సవం కన్నుల పండుగ జరిపించ బడింది గ్రామోత్సవములో జానపద కళారూపాల ప్రదర్శన, కోలాటాలు డప్పు వాయిద్యాలు కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అర్చక వేద పండితులు, అధికారులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

**నేటి కార్యక్రమాలు..**

ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా 14వ తేదీ శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, చండీశ్వర పూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్టానాలు, రుద్రహోమం, సాయంకాలం నిత్య హవనాలు, బలిహరణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు కైలాస వాహనసేవ గ్రామోత్సవం నిర్వహిస్తారు.





గ్రామోత్సవంలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు



# పూల ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు

*మాజీ మంత్రి డా. శైలజానాథ్..*

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 13 :**
శింగనమల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ గుండెపోటుతో చికిత్స పొందుతూ గత రాత్రి మృతి చెందడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి, సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డా. శైలజానాథ్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యతో పాటు పలువురు వైసీపీ శ్రేణులు శింగనమల గ్రామానికి చేరుకొని, పూల ప్రసాద్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పూల ప్రసాద్ కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం పూల ప్రసాద్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం పూల ప్రసాద్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొంటూ, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## టిటిడి ఛైర్మన్, ఈవో సంక్రాంతి శుభాకాంక్షలు

**తిరుమల (తెలుగోడు), జనవరి 13 :**
టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్ శ్రీవారి భక్తులకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల్లో రైతన్నలు కనుమ పండుగ నాడు గోపూజ చేసి గోసంరక్షణకు పాటుపడాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఆ దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారి కటాక్షాలతో ఈ పర్వదినాన్ని భక్తులందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.

# జుపిటర్ 4బి117 మినుము విత్తనాలతో అధిక దిగుబడి

## ఎకరాకు 10 క్వింటాళ్లు.

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 13 :**
ప్రముఖ విత్తన సంస్థ జుపిటర్ కంపెనీకి చెందిన 4బి117 బ్లాక్ గ్రామ్ (మినుము) విత్తనాలతో రైతులు ఆశించిన దానికంటే అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి ఈ విత్తనాలతో సాగు చేపట్టి, ఎకరాకు 10 క్వింటాళ్ల అద్భుత దిగుబడిని సాధించి తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ?మంగళవారం నాడు జుపిటర్ కంపెనీ ప్రతినిధులు మరియు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి కలిసి రామకృష్ణారెడ్డికి చెందిన 6 ఎకరాల మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇతర రైతులకు ఈ వంగడంపై అవగాహన కల్పించారు. జుపిటర్ 4బి117 రకం విత్తనాలు వేర్ల నుండి పైవరకు ఏపుగా కాయలు కాశాయి. వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడ్డాయి. నాణ్యమైన విత్తనాల వల్ల పెట్టుబడి తగ్గి లాభం పెరిగింది" అని రైతు రామకృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఆయన పేర్కొన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని, నిపుణుల సలహాల మేరకు పోషక విలువలు గల ఎరువులను వాడితే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి తెలిపారు . జిల్లా వ్యాప్తంగా సుమారు 300 ఎకరాల్లో ఈ విత్తనాలను సరఫరా చేశామని, అన్నిచోట్లా రైతులకు మెరుగైన దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వారిలో ఆనందాన్ని నింపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 4బి117 రకం మినుము పంట తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుందని, ఏ రకమైన శీతోష్ణస్థితిలోనైనా స్థిరమైన దిగుబడిని ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో జుపిటర్ సీడ్స్ ఎండి సురేష్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న రైతులు కంపెనీ ప్రతినిధులు ,ఏవో

# సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీలు

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 13 :**
స్థానిక మేజర్ పంచాయతీ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కటిక రెడ్డి మధుసూదన్ రెడ్డి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మహిళామణులకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు 30 మంది (ఒక్కొక్క ముగ్గుకు ఇరువురు ఇరువురు) మహిళలు చొప్పున ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మహిళలు, ముగ్గుల పోటీని సందర్శించడానికి తండోపతండాలుగా పాల్గొని సంక్రాంతి పండగను అట్టాసంగా వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అయితే మహిళ అధికారులు ఎంపిక మేరకు వీరిలో మొదటి బహుమతి 10000, రెండవ బహుమతి, ఇరువురు మహిళలు వేసిన ముగ్గులో సమాన మార్కులు ఎంపిక చేసిన మహిళా అధికారులు ఆదేశానుసారం రెండవ బహుమతి 8000,ను ఇరువురికి సమానంగా పంచారు, ఈ ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు చీరలతో మధుసూదన్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధగ్రామాల సంబంధించిన కె ఆర్ అభిమాననాయకులు కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.


మహిళలు వేసిన ముగ్గులు


అంగన్వాడి కేంద్రంలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


# అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 13 :**
దువ్వూరు మండలం గుడిపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఐసిడిఎస్ గుడిపాడు సెక్టార్ సూపర్వైజర్ సౌజన్య పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకలు చిన్నారుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించాయి. గుడిపాడు గ్రామంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగిపళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు వివరించడం మరియు వారిలో పండుగ ఉత్సాహాన్ని నింపడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సెక్టార్ వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.
ఈ సంబరాల్లో గుడిపాడు సచివాలయ మహిళా పోలీస్ శ్రీ రూప, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, సహాయకురాలు (ఆయా) మరియు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించడంతో పాటు, పండుగ విశిష్టతను తల్లులకు వివరించారు.

# సంబరాల సంక్రాంతి అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలి

*రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు ..*
*అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి..*

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 13 :**



సంబరాల సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని, భోగ భాగ్యాలిచ్చే భోగి, సరదాలిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ కొత్త సంవత్సరంలో అందరి కుటుంబాలలో వెలుగులు నింపాలని తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదనాన్ని లోకమంతా చాటుతూ మన సాంప్రదాయాన్ని విశ్వమంతా తెలుపుతుతూ 14న భోగి పండుగ, 15న మకర సంక్రాంతి, 16న కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ జరుపుకోవడం ఆనందాన్నిచ్చే సంబరాల సంక్రాంతి పండుగ అని, పాడిపంటలతో, పచ్చని పైరులతో సస్యశ్యామలం కావాలని ప్రతి రైతు ఇంట సంతోషాలు వెల్లి విరియాలని, ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరికీ భోగభాగ్యాలను ఇచ్చే భోగి, సరదాలు తెచ్చే మకర సంక్రాంతి, ఇప్పటినుండి కొత్తగా, సరికొత్తగా మరింత ఆనందాన్ని పంచాలని కోరుకుంటూ తెలుగు రాష్ట్రాల్లోని రెడ్డి బంధువులకు, ప్రజా ప్రతినిధులకు,, అధికారులకు, ప్రజలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు అని రెడ్డి సంఘం అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి కే. విజయమ్మ

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

*మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి కే. విజయమ్మ ..*

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 13 :**
బద్వేల్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 24,19,131 చెక్కులను మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి కే. విజయమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి విజయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని కొనియాడారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న సామాన్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక సంజీవనిలా మారుతోందని ఆమె పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో రితేష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బాధితుల అభ్యర్థనలను త్వరితగతిన పరిష్కరించి, సీఎం నిధి నుండి సహాయం అందేలా చూస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ టౌన్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగళ్రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు బిగ్ బాస్, అట్లూర్ మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుధారాణి, మరియు టీడీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి కే. విజయమ్మ

# వైయస్ జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 13 :**



రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా రెండు రాష్ట్రాలలోని తెలుగు ప్రజలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సొంత గ్రామాల మీద మమకారానికి మనమంతా ఇచ్చే గౌరవానికి సంక్రాంతి పండుగ ఒక ప్రతీక అని అన్నారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, పైరు పచ్చల కళకళలు గ్రామాల్లో ఎనలేని సంక్రాంతి శోభను తీసుకువచ్చాయన్నారు. ఈ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# భోగ భాగ్యాల భోగి...

### నేడే భోగి పండుగ ..

భోగి అంటే ఏమిటి, ఈ భోగి పండుగ ఎలా వచ్చింది , భోగి మంట , భోగిపళ్ళ వెనుక దాగిన రహస్యాలు ఏమిటి , శ్రీగోదాకళ్యాణం గురించి తెలుసుకుందాం.
పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజును మనం భోగి పండుగగా జరుపుకుంటాం. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవడం వల్ల భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణం ముందు రోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు, దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలు భోగి మంటలు అంటారని మన అందరికి తెలిసిందే. మరైతే ఈ పండుగ రోజున భోగి మంటలు ఎందుకు వేస్తారో వాటి పురాణం, "శాస్త్రీయ కారణాలు" తెలుసుకుందాం..
"భుగు అనే సంస్కృత పదం నుండి భోగి అనే పదం వచ్చింది. భోగం అంటే సుఖం.
పూర్వం ఈ దినమే శ్రీ రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందినది దీని సంకేతంగా భోగి పండగ ఆచరణలోకి వచ్చిందనేదిపురాణ గాథ. శ్రీ మహా విష్ణువు వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళంలోకి తొక్కిన పురాణ గాథ తెలిసిందే. అయితే తరువాత బలి చక్రవర్తికి పాతాళ రాజుగా ఉండమని, ప్రతి సంక్రాంతికి ముందు రోజున పాతాళం నుండి భూలోకానికి వచ్చి ప్రజల్ని ఆశీర్వదించమని వరమిచ్చారు. బలిచక్రవర్తి రాకను ఆహ్వానించడానికి భోగి మంటలు వేస్తారని పురాణాలలో చెప్పబడింది. కృష్ణుడు ఇంద్రుడికి ఒక పాఠం నేర్పుతూ గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజు కూడా ఇదే. శాపవశంగా పరమేశ్వరుని వాహనమయిన బసవన్నని భూమికి పంపించి రైతుల పాలిట దైవాన్ని భూమికి దిగి వచ్చిన రోజు ఇదే అనేది పురాణ గాథ.
సాదారణంగా అందరు చెప్పేది ఇది చలి కాలం కనుక వెచ్చదనం కోసం మంటలు వేస్తారని. కానీ నిజానికి భోగి మంటలు వెచ్చదనం కోసం మాత్రమే కాదు, ఆరోగ్యం కోసం కూడా. ధనుర్మాసం నెలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడుతారు. దేశి ఆవు పేడ పిడకలని కాల్చడం వలన గాలి శుద్ధి అవుతుంది. సుక్ష్మక్రిములు నశిస్తాయి. ప్రాణవాయువు గాలిలోకి అధికంగా విడుదల అవుతుంది. దాని గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. చలికాలం లో అనేక వ్యాదులు వ్యాపిస్తాయి. ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన అనేక రోగాలు పట్టి పిడిస్తాయి. వాటికి ఔషదంగా ఇది పని చేస్తుంది. భోగి మంటలు పెద్దవిగా రావడానికి అందులో రవి , మామిడి , మేడి మొదలైన ఔషద చెట్ల బెరడ్లు వేస్తారు. అవి కాలడానికి ఆవు నెయ్యని వేస్తారు. అగ్ని హోత్రంలో వేయబడిన ప్రతి 10 గ్రాముల దేశీయ ఆవు నెయ్యి నుంచి 1 టన్ను ప్రాణవాయువు (ఆక్షిజన్) ను విడుదల చేస్తుంది. ఈ ఔషద మూలికలు ఆవు నెయ్యి , ఆవు పిడకలని కలిపి కాల్చడం వలన విడుదల అయ్యే గాలి అతి శక్తివంతమైంది. మన శరీరం లోని 72,000 నాడులలోకి ప్రవేశించి శరీరాన్ని శుభ్ర పరుస్తుంది. ఒకరికి రోగం వస్తే దానికి తగిన ఔషదం ఇవ్వవచ్చు , అదే అందరికి వస్తే అందరికి ఔషదం సమకూర్చడం దాదాపు అసాధ్యం. అందులో కొందరు వైద్యం చెయించుకొలేని పేదలు కూడా ఉండవచ్చు. ఇదంతా ఆలోచించిన మన పెద్దలు అందరు కలిసి భోగి మంటల్లో పాల్గొనే సాంప్రదాయాన్ని తెచ్చారు. దాని నుండి వచ్చే గాలి అందరికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కులాలకు అతీతంగా అందరు ఒక చోట చేరడం ప్రజల మధ్యన దూరాలను తగ్గిస్తుంది. ఐక్యమత్యాన్ని పెంచుతుంది. ఇది ఒక రకంగా అగ్ని దేవుడికి ఆరాధన, మరోరకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం కూడా.
మనం ఫ్యాషన్ , సృజనాత్మకత పేరుతో రబ్బరు టైర్లను పెట్రోలు



పోసి తగల బెట్టి , దాని విష వాయువులను పిలుస్తూ , కాలుష్యాన్ని చేస్తూ మన ఆరోగ్యాన్ని తగలేసుకుంటున్నాం. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాము. ఉన్న రోగాలే కాక కొత్త రోగాలని తెచ్చుకుంటున్నాం. ఇక భోగి మంటల్లో పనికిరాని వస్తువులని కాల్చండి అని వింటుంటాం. పనికి రాణి వస్తువులు అంటే ఇంట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు , వైర్లు లాంటివి కావు.
ఇక్కడ మనం చరిత్రకి సంబంధించిన ఒక విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. భారతదేశంలో ఉన్న జ్ఞాన సంపదను నాశనం చేస్తే కాని భారతదేశాని ఆక్రమించుకోలేమనుకున్న బ్రిటిషు దుండుగులు , భోగి మంటల్లో పాత సామాన్లు తగల బెట్టాలనే నెపంతో అమాయక ప్రజలు ఎన్నో వందల సంవత్సరాలుగా వారసత్వంగా కాపాడుకుంటూ వస్తున్న అతి ప్రాచీన తాళపత్ర గ్రంధాలను భోగి మంటల్లో వేసి కాల్పించేసారు. నిజానికి భోగి మంటల్లో కాల్సాల్సింది పాత వస్తువులని కాదు, మనలోని పనికిరాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మనకున్న పీడ పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు వస్తాయి.
భోగి పళ్లు పోయడంలోని అంతరార్ధం తెలుసుకుందాం..
భోగి రోజున భోగి పళ్ల పేరుతో రేగి పళ్లను పిల్లల మీద పోస్తారు. రేగి చెట్టుకు బదరీవృక్షం అని పేరు. రేగి చెట్లు , రాగి పండ్లు శ్రీమన్నారాయణ స్వామి ప్రతి రూపం. ఇది సూర్యునికి ప్రీతిపాత్రమైన ఫలం. సూర్యుని రూపం , రంగు , పేరు కలిగిన రేగుపళ్ళతో నాణేలను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తల పై పోయడం వలన శ్రీ లక్ష్మి నారాయణుల అనుగ్రహం మన పిల్లల పై ఉంటుంది అని , పిల్లలకి ఉన్న దిష్టి తొలగి పోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని మన పెద్దల విశ్వాసం.
మన బాహ్య నేత్రాలకి కనిపించని బ్రహ్మ రంధ్రం మన తలపై



భాగంలో ఉంటుంది. ఈ భోగి పండ్లు పోయి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లలు జ్ఞానవంతులు అవుతారు. రేగు పండ్లు సూర్య కిరణలలోని ప్రాణశక్తి ని అధికంగా గ్రహించి, నిల్వ ఉంచుకుంటాయి. కనుక వీటిని తల మీద పోయడం వలన వీటిలోని విద్యుచ్ఛక్తి , శరీరంపై , ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపించి మంచి ఫలితాలు ఇస్తాయి. అందువలనే పిల్లలకి భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తారు.
మన ప్రతి సంప్రదాయం వెనుక అనేక అర్ధాలు, అంతర్ధాలు , రహస్యాలు ఉంటాయి. అవి తెలియక పోయినంత మాత్రం చేత ఆచార , సాంప్రదాయాలను మూఢనమ్మకాలు అనుకోవడం మూర?త్వం. వాటి విలువలను తెలుసుకొని చేసుకుంటే అవి మనకి మార్గదర్శకులు అవుతాయి.

### శ్రీ గోదా కళ్యాణం..

భోగి పండగనాడే శ్రీ గోదారంగనాథుల కళ్యాణం జరుపటం ఆనవాయితీగా వస్తున్న ఆచారము. ధనుర్మాసం నెలరోజులూ వ్రతంలో భాగంగా అమ్మ అనుగ్రహించిన తిరుప్పావైని అనుసంధించి ఆఖరున కల్యాణంతో ముగించి, శ్రీ గోదారంగనాథుల కృపకు పాత్రులుకావటం మనందరకూ అత్యంత ఆవశ్యకం. శ్రీ విల్లి పుత్తూరంలో వేంచేసియున్న వటపత్ర శాయికి తులసీ దమనకాది పాత్రలను వివిధ రకాల పుష్పాలను మాలాలుగా కూర్చి స్వామికి సమర్పిస్తున్న శ్రీవిష్ణుచిత్తులకు శ్రీ భూదేవి అంశమున లభించిన గోదాదేవి దినదిన ప్రవర్ధమానముగా పెరుగుతూ తండ్రియొక్క భక్తి జ్ఞాన తత్పార్యాలకు వారసురాలైనది. తండ్రిచే కూర్చబడిన తోమాలలను ముందుగా తానే ధరించి "స్వామికి తానెంతయు తగుదును" అని తన సౌందర్యమును నీటి బావిలో చూసుకుని మరల అ మాలలను బుట్టలో పెడుతూ ఉండేడిది. ఇది గమనించిన విష్ణుచిత్తులు ఆమెను మందలించి స్వామికి ఇట్టిమాలలు కైంకర్యము చేయుట అపరాధమని తలచి మానివేసిరి. శ్రీస్వామి విష్ణుచిత్తులకు , స్వప్నమున సాక్షాత్కరించి ఆమె ధరించిన మాలలే మాకత్యంతప్రీతి – అవియే మాకు సమర్పింపుడు అని ఆజ్ఞ చేసిరి. ఈమె సామాన్య మనవకాంత కాదనియు తన్నుద్దరించుటకు ఉద్భవించిన యే దేవకాంతయో భూదేవియో అని తలుస్తూ స్వామి ఆజ్ఞ మేరకు మాలా కైంకర్యమును చేయసాగిరి.
యుక్త వయస్సు రాలైన గోదాదేవిని చూసిన విష్ణు చిత్తులు ఆమెకు వివాహం చేయనెంచి అమ్మా నీకు పెండ్లీడు వచ్చినది నీ వేవరిని వరింతువో చెప్పుము నీ కోరిక మేరకే వివాహము చేతును అనిరి. తండ్రి మాటలు వినిన గోదాదేవి ల్లజ్జవదనయై తమరు సర్వజ్ఞులు తమకు తెలియనిదేమున్నది అపురుషోత్తముని తప్ప నేనింకెవరినీ వరింపను ఇతరుల గూర్చి యోచింపను అని తన మనోభీష్టాన్ని తెలియజేసెను. అప్పుడు విష్ణుచిత్తులు "కొమడలు అను లోకప్రసిద్ధ గ్రంధము ననుసరించి ఆ వటపత్రశాయి వైభవముతో ప్రారంభించింది నూట ఎనిమిది దివ్య తిరుపతిలలో అర్చామూర్తులైయున్న పెరుమాళ్ళ వైభవాతిశయయులను వర్ణింపసాగిరి అ క్రమములో చివరకు "అజికియ మనవాళన్ అను శ్రీరంగనాథుల రూపరేఖా విలాసములను వర్ణింపగనే "జితాస్మి" అని , ఆమె హృదయమందంతటను అరంగనాథుని దివ్య మంగళ స్వరూపమే నింపి యుంచుకొనినదై గగుర్పాటు పొందుచుండెను. ఆ స్థితిని గమనించిన విష్ణుచిత్తులు "అదెట్లు సాధ్యము" అని చింతాక్రాంతులై నిదురింప ఆ శ్రీరంగనాధులు స్వప్నమున శాక్షాత్కరించి నీ పుత్రిక భూజిత గోదను మాకు సమర్పింపుడు ఆమెను పాణిగ్రహణము చేసికొందును. వివాహ మహొత్సావానికి నా అజ్ఞమేరకు తగిన సామగ్రులు తీసుకుని పాండ్యమహారాజు ఛత్రధ్వజ చామరాదులతో మరియు రత్నాదులచే అలంకరించబడిన దంతపు పల్లకిలో మిమ్ముల స్వాగతించెదడు అని పలుకగా విష్ణుచిత్తులు మేల్కొంచి అత్యంత ఆనందోత్సాహములతో తనజన్మ సార్థకమైనదని పొంగి పోవతూ సకల మంగళ వాయిద్యములు మ్రోగుచుండగా గోదాదేవిని శ్రీరంగమునకు తోడ్కొని పోయిరి. సమస్త జనులున్నా పాండ్యమహీభూపాలుడున్నా విష్ణు చిత్తులను ఆ సన్నివేశం దర్శించి ధనుల్వైరి.
ఇట్లు అండాళ్ తల్లి తాను చేసిన ధనుర్మాస వ్రత కారణమున పరమాత్మను తానుపొంది మనలను ఉద్దరించుటకు మార్గదర్శినియై నిలచినది. శ్రీరంగనాధుడు స్వయముగా అమెనే వరించి పాణిగ్రహణము చేసినాడు దీనినే మనము భోగిపండుగనాడు భోగ్యముగా జరుపుకొనుచున్నాము. శ్రీ గోదా రంగనాథుల కళ్యాణము చూచినను చేయించినను , ఈ కథ వినినను బిబిచదివిననూ సకల శుభములు చేకూరుననుటలో సందేహం లేదు.
అండాళ్ దివ్య తిరుగడిగళే శరణమ్..
ఆండాళ్ లేదా గోదాదేవి , శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తరువాత గోదా దేవి , శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలని తలచినది.

**– రేనాటి నాగేశ్వర రెడ్డి,**
**సీనియర్ పాత్రికేయులు**



## కాఫీ విత్ వైసీపీ క్యాడర్ కార్యక్రమం

**వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ..**

**పెనుకొండ (తెలుగోడు), జనవరి 13 :**
పెనుకొండ నియోజకవర్గం, పరిగి మండలం, బీచిగానిపల్లి పంచాయతీ వంగలపల్లి, పాత్రగానిపల్లి గ్రామాలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కాఫీ విత్ వైసీపీ క్యాడర్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి, జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాడని, ఎప్పుడు ప్రజలు శ్రేయస్సు కోరే జననాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు అని ప్రతి ఒక్కరికి గుర్తు చేశారు, రైతులకు ప్రతి ఏడాది రైతు భరోసా తో పాటు పంట బీమా ఇస్తూ రైతులకు భరోసా నిలబడ్డ ఏకైక నాయకుడు జగనన్న అని అన్నారు, ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి రెండు సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని, ప్రతి ఒక్కరికి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీచిగానిపల్లి పంచాయతీలో పంచాయతీ వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి పంచాయతీ కమిటీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పరిగి మండల ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, వైసీపీ కార్యకర్తలు,బీచిగానిపల్లి పంచాయతీ వంగలపల్లి, పాత్రగానిపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రేకులకుంటలో ఊరిదేవర

**బుక్కరాయసముద్రం (తెలుగోడు), జనవరి 13 :**
బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలో జరిగిన ఊరిదేవర కార్యక్రమానికి సోదరులు నల్లప్ప, రాజు, వీరాంజనేయులు నాగరాజు ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దులచెరువు మల్లి , ఎస్సీ ఎస్టీ ఫోరం అధ్యక్షుడు నిరమెట్ల ఎల్లన్న, జై భీమ్ సేన ఆకులేడు ఓబులేసు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలు,ఎతీజూం సీనియర్ నాయకులు చిన్న ఆంజనేయులు, చెన్నంపల్లి ఓబులేసు,భాస్కర్, సంజీవులు, ఎమ్మెసేఫ్ అధ్యక్షుడు నగేష్,కుళ్లాయప్ప తదితరులు హాజరయ్యారు.



## కదిరిలో పోలీసుల విస్తృత తనిఖీలు

**కదిరి (తెలుగోడు), జనవరి 13 :**
కదిరి డిఎస్పి ఉత్తర్వుల మేరకు కదిరి టౌన్‌లోని అన్నీ లాడులు, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, కేప్‌లు, ఇతర ప్రదేశాలను పోలీసులు తనిఖీ చేశారు. నల్లచెరువు ఎస్ఐ మక్బూల్, గాండ్ల పెంట ఎస్ఐ సుమతీ, కదిరి టౌన్ ఎస్ఐ భువనేశ్వరి, కదిరి రూరల్ ఎస్ఐ నరసింహులు, ఇతర సిబ్బంది కలిసి టీంలుగా ఏర్పడి తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేఖ కార్య కలాపాలు జరిగినా, సంబంధిత యాజమానుల పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# గ్రామాల అభివృద్ధికి రూ. 318 కోట్లు మంజూరు

## దగదర్తి ఎయిర్పోర్ట్, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులతో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి.. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఆత్మకూరు, (తెలుగోడు), జనవరి 13 :**
రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు సరికొత్త సంక్రాంతి శోభను తీసుకొచ్చిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు.
మంగళవారం ఉదయం ఆత్మకూరు నియోజకవర్గంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి ఆనం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతసాగరం మండలం ఎగువపల్లి, మర్రిపాడు మండలం రాజుపాలెం, ఏఎస్‌పేట మండలం మదరాబాదు, కావలియడవల్లి, సంగం మండల కేంద్రంలో, చేజర్ల మండలం ఎన్‌వి కండ్రిగలో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్లు, సిమెంటురోడ్లను మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా మర్రిపాడు మండలం రాజుపాలెం గ్రామంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ ఒక్కరోజే ఆరు ప్లాంట్లను ప్రారంభించామని, మొత్తం ఆత్మకూరు నియోజకవర్గం లో ఇప్పటివరకు 27 ప్లాంట్లను వేమిరెడ్డి సొంత నిధులతో నిర్వహిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించడం పట్ల వేమిరెడ్డి సేవాభావాన్ని కొనియాడారు.
రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో ప్రతి గ్రామంలో కూడా రహదారులు, మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేసిందని చెప్పారు. పల్లె పండుగ ద్వారా నెల్లూరు జిల్లాలో 318 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 567 సీసీ రోడ్లకు 36.12 కోట్లకు నిధులు వెచ్చించామన్నారు. 172 గోకులాల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. అనంతసాగరం మండలంలో 79 సిసి రోడ్లకు 5.47 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం లో జల్జీవన్ మిషన్ ద్వారా 335 పనులకు 66 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. పశు సంపద అభివృద్ధి కోసం పశువుల షెడ్లతోపాటు పాటు క్యాటిల్ హాస్టల్స్ కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పల్లె పండుగ అభివృద్ధి పనులు గ్రామాలకు సరికొత్త సంక్రాంతి వెలుగులు తీసుకొచ్చాయని మంత్రి ఆనం చెప్పారు.
నెల్లూరు జిల్లాలో దగదర్తి ఎయిర్పోర్ట్ నిర్మాణానికి 487 ఎకరాలకు నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. 900 కోట్లతో విమానాశ్రయాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులతో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని కూడా మర్రిపాడు మండల అభివృద్ధి కోసం వినియోగిస్తున్నట్లు చెప్పారు. సోమశిల హై లెవెల్ కెనాల్ మొదటి విడత పనులు పూర్తి చేసి మెట్ట ప్రాంతాలను చేస్తామని ఈ సందర్భంగా ఆనం పునరుద్ఘాటించారు.
శ్రీవాణి ట్రస్టు ద్వారా ప్రజల ఆకాంక్షల మేరకు గ్రామాల్లో దేవాలయాలను నిర్మించేందుకు త్వరలోనే మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 150 ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. 5870 ఆలయాల్లో ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ప్రతినెల 10వేలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. 1058 పురాతన ఆలయాల్లో పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ఎవరూ ఊహించని విధంగా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేశామని మంత్రి ఆనం తెలిపారు. ప్రజలపై భారం పడకుండా ఆర్టీసీకి ప్రభుత్వం కోట్ల రూపాయలు చెల్లిస్తూ ఉచిత బస్సు, స్త్రీ నిధి పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా ఇప్పటివరకు నాలుగు కోట్ల మందికి భోజనం అందించామని, కోట్లాది రూపాయలతో పింఛన్లు క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.గ్యాస్ సంస్థలకు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ ప్రజలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు.



వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తరలివస్తున్నాయని, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నామని అన్నారు.
త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తామని, పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ పేరుతో గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో చేసిన 10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ... ఆర్థిక భారాన్ని మోస్తూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి సుపరిపాలన అందిస్తోందని చెప్పారు.

***విపిఆర్ అమృత ధారతో గ్రామీణ ప్రాంతాల దాహార్తి తీరుతోంది.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి..***

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో 6 వాటర్ ప్లాంట్లను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు పెట్టిన అన్ని ప్లాంట్ల ను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆత్మకూరులో 27 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. పండుగ పూట ఇళ్లకు వచ్చిన అందరికి ఈ ప్లాంట్స్ ఉపయోగపడతాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రతి చోటా ప్రజలు సంతోషపడేలా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంగం - కలిగిరి డబల్ రోడ్డు నిర్మాణానికి 14 కోట్లు మంజూరు

## ప్రజలకు అన్ని విధాల మేలు చేసే ప్రభుత్వం ఇది.. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..

**ఆత్మకూరు (తెలుగోడు), జనవరి 13 :**
ఆత్మకూరు నియోజకవర్గం లోని సంగం - కలిగిరి రహదారిని డబల్ రోడ్డుగా నిర్మించేందుకు రూ 14 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏఎస్పేట మండలం మదరాబాద్ , కావలి ఎడవల్లి గ్రామంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఆనం శ్రీకారం చుట్టారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన విపిఆర్ అమృత ధార మినరల్ వాటర్ ప్లాంట్ ను మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అలాగే మదరాబాద్ లో జల్ జీవన్ మిషన్ కింద 22 లక్షలతో చేపట్టిన తాగునీటి పథకాన్ని మాదరాబాదులో ప్రారంభించారు. మధురాబాదు గ్రామంలో నేతలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా పల్లె పండుగ ర్యాలీని నిర్వహించి ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా కావలి ఎడవల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సంగం-కలిగిరి రహదారిని డబల్ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అందరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని, ఇది చాలా సంతోషకరమైన విషయమని మంత్రి ఆనం అన్నారు. త్వరలోనే మంత్రుల సమక్షంలో వైభవంగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు సరికొత్త సంక్రాంతి శోభను తీసుకొచ్చిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఈ గ్రామంలోని ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా ప్రభుత్వం ద్వారానే నిధులు మంజూరు చేస్తామని ఆనం స్పష్టం చేశారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అన్ని విధాల మేలు చేసే ప్రభుత్వం తమదని ఆనం స్పష్టం చేశారు.
ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసేందుకే విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. విపిఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, సీతారామపురం, ఉదయగిరిలో 15 వేల మందికి కంటి పరీక్షలు చేసి 8వేల మందికి ఉచితంగా అద్దాలు అందజేసామన్నారు. అనుభవం ఉన్న ఆనం రామనారాయణ సారధ్యంలో ప్రతి చోటా అభివృధి కనిపిస్తోందని చెప్పారు. ప్రతి వాటర్ ప్లాంట్ మెయింటైన్ తామే నిర్వహిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో పనులు చేపట్టారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు వంటి సూపర్ హిట్ పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విపిఆర్ అమృత ధార మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



విపిఆర్ అమృత ధార మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

# వెలుగునిచ్చే పండుగ.. సంక్రాంతి

**యాడికి (తెలుగోడు), జనవరి 13 :**
ధనుర్మాసంలో మంచు కురుస్తుంది.. .. వీధులు చల్లగా ఉంటాయి.... ముగ్గులతో అందంగా ఉంటాయి... పంటలు పండుతాయి. పండుగలూ మొదలవుతాయి... ప్రతి ఏడాది పండుగలు సంక్రాంతితో మొదలవుతాయి. అందుకే సంక్రాంతిని సంవత్సరంలో తొలి పండుగగా చెబుతారు. ఏడాది మొత్తం కష్టపడి పండించిన పంటలు ఇళ్లకు చేరే సమయం... గంగిరెద్దుల ఆటలతో, హరిదాసులు సంకీర్తనలతో, చిన్నారులు... అమ్మాయిలు గొబ్బి పాటలతో, కొత్త అల్లుళ్ళ సందళ్ళతో ఊరంతా సందడిగా మారే రోజు సంక్రాంతి.. రైతుల పండుగ... జానపదుల పండుగ.. శ్రమ జీవుల పండుగ... జంతువులలో సైతం దివ్యత్వాన్ని ప్రతిబింబించే పండుగ.. పిల్లలకు గాలి పటాల పండుగ.
దక్షిణాదిన శుభకార్యాలన్నీ సంక్రాంతి తరువాతనే ఆరంభిస్తారు. సంక్రాంతికి నెల రోజుల ముందే సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశిస్తాడు. అప్పటి నుంచి పండుగ నెల ప్రారంభమవుతుంది. రంగు రంగు ముగ్గులతో ధనుర్మాసానికి స్వాగతం పలుకుతారు ఆడవాళ్లు . నెల రోజులపాటు ఇంటి లోగిళ్లు ముగ్గులతో కళకళలాడుతాయి. మన పెద్దవాళ్లు ఎన్నో ఆరోగ్య సూత్రాలతో తరతరాల నుంచీ ఈఆచారాలను పాటిస్తున్నారు.
ధనుర్మాసం నెలరోజుల పాటు వైష్ణవాలయాలో ప్రతిరోజూ తెల్లవారు జామున తిరుప్పావై వైభవంగా జరుగుతుంది. ఆలయాల్లో దేవునికి కట్టెపొంగలి ప్రసాదంగా నివేదిస్తారు. దీని వెనుక కూడా ఆరోగ్య సూత్రం ఇమిడివుంది. శీతాకాలం చలి ప్రభావానికి మిరియాలతో చేసిన వట్టిపొంగలి మంచి విరుగుడుగా పనిజేస్తుందట.
హిందువుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలైన పండుగల్లో సంక్రాంతి పండుగే ప్రధానం. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారు. భోగభాగ్యాలతో, సిరిసంపదలను కురిపిస్తూ... కొత్తకాంతులను విరజిమ్ముతూ... కొత్త ధాన్యాలతో ... సంక్రాంతి లక్ష్మి ప్రవేశిస్తుందని కవులు వర్ణిస్తారు. పిల్లలూ... పెద్దలూ.. ఇంటిల్లిపాదీ ఎంతో శోభాయమానంగా జరుపుకుంటారు. ఈ పండుగను మూడు రోజులు జరుపుకోవడం ఆనవాయితీ.

***భోగితోనే వైభోగం..***

జీవింతంలో ఇప్పటి వరకు అనుభవించిన అన్ని పీడలు తొలగి.. భోగతో వైభోగం మొదలవుతుంది అంటారు. పెద్దలు, పిల్లలు అందరు వేకువజామునే నిద్ర లేచి కొన్ని రోజులుగా సేకరించిన ఆవు పిడకలు.. ఎండు కట్టెలు.. వేసి భోగిమంటను వేస్తారు. కొన్ని రాష్ట్రాలలో పనికిరాని పాత సామానుతో మంట వేసే ఆచారం కూడా ఉంది. అంతేకాదు ఈ భోగి మంటల్లో ఇంట్లో పనికిరాని పాత వస్తువులు చేస్తే భోగిపీడ పోతుందని నమ్ముతారు. కుటుంబమంతా ఈ భోగిమంట చుట్టూ చేరి చలి కాచుకుంటూ పాటలు పాడతారు. కొన్ని ప్రాంతాలలో డప్పు వాయిస్తూ పాటలు పాడతారు. ఇలా భోగిపీడను వదిలించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. తర్వాత తలంటు స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి తీపి తింటారు.గారెలు, బూరెలు, పులిహోర, అరిసెలు, జంతికలు, పప్పుబిళ్లలు వంటి రకరకాల పిండి వంటలు చేసుకుని బంధుమిత్రులతో కలిసి భోజనం చేస్తారు. ఆనవాయితీ ఉన్నవారు తమ తమ ఇళ్లల్లో గౌరీ దేవీ రూపంలో గొబ్బెమ్మలను పెట్టి పాటలు పాడి పూజ చేసి ముత్తైదువులకు తాంబూలం ఇస్తారు.
భోగిరోజు ... 12 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న చిన్న పిల్లలకు రేగు పండ్లు, బొరుగులు, చిల్లర నాణాలు వంటివి కలిపి భోగిపళ్లు పోస్తారు. అలా చేస్తే దృష్టి దోషాలు పోతాయని నమ్ముతారు. భోగిరోజు సాయంత్రం వైష్ణవాలయాలలో శ్రీ గోదాదేవి... రంగనాధుల కళ్యాణం అత్యంత వైభవంగా జరుపుతారు.





***రెండో రోజు మకర సంక్రాంతి***

'క్రాంతి' అంటే వెలుగు... సం... అంటే చేరుకోవడం... సంక్రాంతి పండుగ అంటే వెలుగును ఆహ్వానించడం అని అర్థం . సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతి. ఈ రోజును పవిత్ర పుణ్య దినంగా భావిస్తారు. ఇలాంటి పుణ్య ఘడియలు ఆషాడశుద్ధ ఏకాదశి వరకు ఉంటాయి. కొత్త కుండలో పాలు పొంగించి, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో పొంగలి వండుతారు. ఇదే రోజు హరిహరసుతు తనయుడు.. కేరళలో వేంచేసిన.. ధర్మశాస్తుడు.. అయ్యప్పస్వామి జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిస్తాడని పురాణాల ద్వారా తెలుస్తుంది. మకరరాశికి అధిపతి శని. అందుకే మకర సంక్రాంతి రోజున శనికి ప్రీతికరమైన నల్ల నువ్వులు బెల్లంతో చేసిన లడ్డూలు గుమ్మడికాయలు దానం చేస్తారు. ఇలా చేస్తే ఆరోగ్యం. సిరిసంపదలు వృద్ధి చెందుతాయని విశ్వాసం. ఈ రోజున ఏ దైవాన్ని పూజించినా, యజ్ఞం చేసినా విశేష ఫలితం ఉంటుందంటారు. ఈ రోజున పితృదేవతల ప్రీతి కోసం తర్పణాలు వదులుతారు. అంతేకాదు ఈ రోజు మరణిస్తే స్వర్గప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు.

***మూడో రోజు కనుమ..***

మూడవరోజును కనుము పండుగగా జరుపుతారు. ఇది కర్షకుల పండుగ . ఈ రోజు పాడిపంటలను, పశుసంపదలను లక్ష్మీస్వరూపంగా పూజిస్తారు. ఈ పండుగ రోజున ఆడపడుచులు పసుపుకుంకుమలు ఇచ్చి పుచ్చుకుంటారు. సంవత్సరమంతా రైతులకు చేదోడువాదోడుగా ఉండే పశువులను కృతజ్ఞతాపూర్వకంగా ఈ రోజున అలంకరించి పూజిస్తారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరిస్తారు. గంగిరెద్దుల వాళ్లు ఇల్లిల్లూ తిరుగుతూ ఎద్దుల అందరికి ఆశీర్వాదాలు ఇస్తూ ఆడి పాడి అలరిస్తారు. సంక్రాంతికి వారు సంపాదించేది. సంవత్సరమంతా వస్తుందని చెబుతారు. కొన్ని ప్రాంతాలలో ప్రభలను ఊరేగిస్తారు. కలియుగ వైకుంఠం తిరుపతిలో శ్రీవాది పార్వేటి ఉత్సవం కనుమ రోజు ఎంతో కన్నుల పండుగగా జరుగుతుంది.

***నాలుగో రోజు ముక్కనుమ..***

పండుగను మూడు రోజులు జరిపి నాలుగో రోజు ఆనందాల నుంచి ఆధ్యాత్మికంలోకి వస్తారు. చాలా ఊళ్లలో గ్రామ దేవతలకు నైవేద్యాలు పెట్టి సంబరాలు జరుపుతారు. రంగు రంగు ముగ్గులకు స్వస్తి పలికి రథం ముగ్గులను ఇళ్లముందు వేసి పండుగను వీడ్కోలు పలు కుతారు. చెన్నై లో దీనిని తిరుగుడు పండగ అంటారు. ఈ రోజు ఎవరూ ఇంట్లో ఉండదు. పగలంతా బయట తిరిగి, రాత్రి సమయానికి ఇల్లు చేరుతారు. ఈ ఆచారం తెలుగునాట కొన్ని ఊర్లలో మాత్రమే కనబడుతుంది.
సంక్రాంతికి తెలుగు వాళ్లు కోళ్లతో పందేలు వేసి సంబరాలు చేస్తారు. మకర సంక్రాంతిని తెలుగు వాళ్లు సంక్రాంతి అని, తమిళనాడు లో 'పొంగల్లు అని, బెంగాల్ లో తిల ప్రా "సంక్రాంతి అని, పంజాబ్ లో 'లోహిడి' అని, మహారాష్ట్రలో 'సిటీ' సంక్రాతి అది వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. కొన్ని ప్రాం తాలలో ఎడ్ల పందేలు జరుపుతారు. మరికొన్ని ప్రాంతాలలో ఈ రోజున పితృదేవతల పేరిట వస్త్రదానం చేస్తారు.

# మన శంకరప్రసాద్ తొలిరోజే 84 కోట్ల వసూలు

'పండగకు వస్తున్నాం.. హిట్ కొడుతున్నాం..' అంటూ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చి సందడి చేశారు చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదలైంది. ప్రీమియర్స్ నుంచే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు హిట్ టాక్ రావడంతో మొదటిరోజు వసూళ్లపై అందరిలోను ఆసక్తి నెలకొంది. తాజాగా ఆ వివరాలను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రీమియర్స్‌తో కలిపి మొదటి రోజు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.84 కోట్లు వసూలుచేసినట్లు వెల్లడించింది. 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టేశారంటూ పోస్టర్‌ను పంచుకుంది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. కథేంటంటే..: శంకరవరప్రసాద్(చిరంజీవి)నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. కేంద్రమంత్రి శర్మ (శరత్ సక్సేనా) రక్షణ బాధ్యతల్ని చూస్తుంటాడు. మంత్రి కూడా శంకరవరప్రసాద్‌ని తన కుటుంబసభ్యుడిలా చూస్తుంటాడు. భార్య శశిరేఖ (నయనతార) నుంచి వరప్రసాద్.. విడిపోయిన సంగతి తెలుసుకుని, ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లలతో కలిసి గడిపేలా ఏర్పాట్లు చేస్తాడు మంత్రి. పీఈటీగా ఆ స్కూల్‌లోకి అడుగుపెట్టిన శంకరవరప్రసాద్ తన పిల్లలకు చేరువయ్యాడా? అసలు భార్యతో ఎందుకు విడిపోయాడు? వాళ్ల పెళ్లి ఎలా జరిగింది? ఊహ తెలియని వయసులోనే తండ్రికి దూరమైన పిల్లలకు శంకరవరప్రసాదే తమ తండ్రి అనే విషయం ఎప్పుడు తెలిసింది?కర్ణాటకకు చెందిన మైనింగ్ బిజినెస్‌మ్యాన్ వెంకీ గౌడ (వెంకటేశ్)కీ, శశిరేఖకీ సంబంధం ఏమిటి? విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నారా, లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.





# ఇద్దరు భామల కథకు కొత్తదనం




ఓ కుటుంబ కథని ఎంచుకుని రవితేజ చేసిన సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సున్నితమైన కథలకు పెట్టింది పేరైన కిశోర్ తిరుమల దర్శకుడు కావడంతో రవితేజని కొత్తగా చూసే అవకాశం ఉంటుందనే ఆశ ప్రేక్షకుల్లో కలిగింది. రామ్ సత్యనారాయణ (రవితేజ), బాలామణి (డింపుల్ హయాతి) భార్యాభర్తలు. తన భర్త రామ్‌పై బాలామణికి ఎంతో నమ్మకం. తను తప్ప వేరే ప్రపంచం తెలియని మనిషి అనుకుంటుంది. తన కుటుంబానికి చెందిన వ్యాపార వ్యవహారాల్లో భాగంగా రామ్ స్పెయిన్ వెళ్లాల్సి వస్తుంది. అక్కడ అనుకోకుండా మానస శెట్టి (ఆషికా రంగనాథ్)తో బంధం ఏర్పడుతుంది. తనకి పెళ్లయ్యిందనే విషయాన్ని దాచి మరీ, తనని తాను సత్య అని పరిచయం చేసుకుని మానసకు దగ్గరవుతాడు. ఏమీ జరగనట్టే ఇంటికి తిరిగొచ్చిన రామ్ సత్యనారాయణ తనపై తన భార్య చూపిస్తున్న ప్రేమతో అప్పుడప్పుడూ అపరాధ భావానికి గురవుతుంటాడు. ఇంతలోనే స్పెయిన్ నుంచి మానస ఇండియాకి వస్తుంది. ఆమె వచ్చాక ఏం జరిగింది? ఇద్దరి మధ్య బంధం కొనసాగిందా? భార్య బాలామణికి ఈ విషయం తెలిసిందా?రామ్ అలియాస్ సత్యకు పెళ్లయ్యిందనే విషయం తెలిశాక మానస ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయిన చాలా మంది కథానాయకుల్ని, కథల్ని గుర్తు చేస్తుంది ఈ చిత్రం. కానీ, హాస్యంపై మాత్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సందర్భోచితమైన హాస్యంతో సినిమా సరదా సరదాగా సాగుతూ, మంచి కాలక్షేపాన్నిస్తుంది. కిశోర్ తిరుమల సినిమాల్లో కథానాయకులు సరికొత్తగా కనిపిస్తుంటారు. ఈ సినిమా లోనూ అదే పునరావృతమైంది. రవితేజ కొత్తగానే కనిపించారు. ఆయన లుక్, పాత్రలో ఒదిగిపోయిన తీరు, అలవోకగా ఆయన వినోదం పంచిన తీరు బాగుంది. ఆయన గత సినిమాలతో పోలిస్తే ఇది ఎంతో ఉపశమనం. స్పెయిన్ నేపథ్యంలో కథ మొదలవుతుంది. సత్య, వెన్నెల కిశోర్, సునీల్ తదితరులతో రవితేజ చేసే హంగామా బాగా నవ్విస్తుంది. మానస శెట్టి ఇండియాకి వచ్చినప్పటి నుంచి సినిమా మరింత సందడిగా మారిపోతుంది. విరామ సన్నివేశాల వరకూ సినిమా ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఆ తర్వాతే కథలో సంఘర్షణ తగ్గింది. మానస శెట్టికి తోడుగా మరో శెట్టి పాత్ర తోడై సన్నివేశాలు సాగిపోతాయే తప్ప కథలో మాత్రం కొత్తగా మారేదేమీ ఉండదు. తొలి సగభాగం తరహాలోనే కథానాయకుడు ఇద్దరు హీరోయిన్ల మధ్య నలిగిపోవడం కనిపిస్తుంటుంది. కాకపోతే బాబాయ్ అంటూ త్రినేత్ర పాత్ర చేసే హంగామా కాస్త నవ్వుల డోసుని పెంచుతుంది. స్పెయినా.. పెయినా.. అంటూ కథలో కొత్త టెన్షన్ మొదలవుతుంది. దాంతో పతాక సన్నివేశాల్లో సంఘర్షణ మోతాదు పెరుగుతుందేమో అనుకుంటాం. కానీ, అందుకు భిన్నంగా ఇలాంటి సమస్యలకు ఓ కొత్త పరిష్కారాన్ని చూపించి.. కథానాయకుడితో ఓ కొత్త విషయాన్ని చెప్పించి కథని ముగించారు. చాలా సార్లు చూసినట్టుగా, అసలు ఉందా లేదా అనిపించే కథతోనే దర్శకుడు నవ్వులు పండించాడు. సోషల్ మీడియాను అనుసరించే వాళ్లను ఇందులోని సంభాషణలు మరింత అలరిస్తాయి. పాటలకు తగ్గట్టుగా సన్నివేశాల రచన సాగలేదనిపిస్తుంది. మొత్తంగా కాలక్షేపానికి ఏమాత్రం ఢోకా లేదు. రవితేజ హుషారైన నటన ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. పాత్రలో ఒదిగిపోయి, స్వేచ్ఛగా నవ్వులు పండించారు.

# వివాదంలో యష్ టాక్సిస్




కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ వెంటనే రంగంలోకి దిగింది. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' అనే ఉపశీర్షికతో రూపొందుతున్న ఈ చిత్ర గ్లింప్స్‌లో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కాస్త ఘాటుగానే స్పందించారు. ఒక మహిళా దర్శకురాలు అయ్యుండి ఇలాంటి సన్నివేశాలను ఎలా చిత్రీకరించారు అంటూ వస్తున్న కామెంట్లను చూసి తాను ఏమాత్రం ఆశ్చర్యపోవడం లేదని, ఆ విమర్శలను తాను చాలా తేలిగ్గా తీసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.

# మీనాక్షి చౌదరి పండుగ సందడి




టాలీవుడ్‌లో 'లక్కీ హీరోయిన్'గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది.ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్స్ ఇచ్చే వ్యక్తే తన 'రాజు' అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది.

# జపాన్‌లో పుష్ప 2 విడుదల



ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'పుష్పరాజ్' ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. జనవరి 16న జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' భారీ స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో, ఈ చిత్ర ప్రమోషన్ల కోసం బన్నీ స్వయంగా రంగంలోకి దిగారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నారు. సోమవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భార్య స్నేహా రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి కనిపించిన బన్నీ టోక్యో చేరుకున్నట్లు తెలుస్తుంది. టోక్యోలోని తన హోటల్ గది నుంచి నగర అందాలను చూపిస్తూ అల్లు అర్జున్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో ప్రస్తుతం వైరల్ అవుతోంది.సినిమా విషయానికి వస్తే.. జపాన్ పంపిణీ సంస్థలు 'గీక్ పిక్చర్స్', 'షోచికూ' సంయుక్తంగా ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చేస్తున్నాయి. జపాన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను అక్కడ 'పుష్ప కున్రిన్' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రష్మిక మందన్న 'జాతర' ఎపిసోడ్ మరియు ఫహాద్ ఫాసిల్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ జపాన్ ఆడియన్స్‌ను కూడా మెప్పిస్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు ఇప్పటికే గ్లోబల్ వైడ్ వైరల్ అయ్యాయి. భారత్‌లో ఐదు భాషల్లో విడుదలైన 'పుష్ప 2', ఇప్పటికే సంచలన వసూళ్లతో 'ఇండస్ట్రీ హిట్'గా నిలిచింది. ఇప్పుడు జపాన్ మార్కెట్‌ను కూడా కొల్లగొట్టడం ద్వారా ఇండియన్ సినిమా ఖ్యాతిని మరింత పెంచాలని మైత్రీ మూవీ మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు.

# ద రాజాసాబ్ సంక్రాంతి దూకుడు




పాన్ ఇండియా నటుడు ప్రభాస్ నటించిన లేటెస్ట్ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. మారుతి దర్శకత్వంలో జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ కలెక్షన్లపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. తాజాగా ఈ సినిమా నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో అధికారికంగా అడుగుపెట్టింది. విడుదలైన మొదటి రోజే రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ప్రభాస్, తాజాగా నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 201 కోట్ల గ్రాస్ మార్కును అందుకున్నారు. సోమవారం వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ ఓవరాల్‌గా సినిమా ఇంకా నిలకడగా కొనసాగుతోంది. సినిమాపై విమర్శకుల నుంచి, సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రభాస్ క్రేజ్ ముందు అవేవీ నిలవడం లేదు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభాస్ వింటేజ్ కామెడీ టైమింగ్, డ్యాన్స్ మరియు మారుతి మార్క్ ఎంట్టంల్గ÷న్‌మెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నాయి. ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ మేరకు, చిత్ర బృందం ఇటీవలే ప్రభాస్ 'ఓల్డ్ అవతార్'కు సంబంధించిన సుమారు 11 నిమిషాల నిడివి గల కొత్త సన్నివేశాలను సినిమాకు జత చేసింది. ఈ మార్పు తర్వాత థియేటర్లలో రెస్పాన్స్ మరింత పెరిగిందని, ముఖ్యంగా సెకండ్ హాఫ్ ఇప్పుడు మరింత ఎంట్టంల్గ÷నింగ్‌గా ఉందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.